


# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

RNI APTEL : 2023/88704

శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 03, సంచిక : 305 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ గురువారం - 09 - జులై - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,

## లష్కరే టాప్ కమాండర్ జాకీర్ ను కాల్చి చంపిన బలగాలు




కశ్మీర్‌లో మరో విజయాన్ని సాధించిన భద్రతాబలగాలు

షోపియాన్ జిల్లాలో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

లష్కరే టాప్ కమాండర్ హతం..

మరో ఉగ్రవాది కోసం గాలింపు

## ఎన్నికల విజయంపై న్యాయపోరు.. సీఎం విజయ్‌కు కొత్త చిక్కులు




ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత సి.జోసెఫ్ విజయ్‌కు మరో కొత్త సవాలు ఎదురైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీవీకే విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ మేరకు స్పందించింది న్యాయస్థానం.

## రావణ్ అరెస్ట్ పై కొడాలి నాని సంచలన వ్యాఖ్యలు

రావణ్‌ను కొత్త చట్టం తెచ్చి జైలుకు పంపించారన్న కొడాలి నాని

చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణను రావణ్ ఒక మాట కూడా అనదని వ్యాఖ్య




అమరావతి: యూట్యూబర్ రావణ్ అరెస్ట్ వ్యవహారంపై మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఈ రాష్ట్రంలో ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, విమర్శించినా కొత్త కొత్త చట్టాలు తెచ్చి జైల్లో బంధిస్తున్నారు. ప్రజల నోరు నొక్కేందుకు ఈ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా ప్రయత్నిస్తోంది" అని కొడాలి నాని మండిపడ్డారు.

# నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెస్తానన్న హరీశ్
- విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ఆరోపణ




# టెట్‌లో వీళ్లూ పాస్ కావాలనడం ఎంతవరకు కరెక్టు: వైఎస్ జగన్

- ఈ మేరకు వైఎస్ జగన్ ఎక్స్‌లో స్పందిస్తూ..
- చంద్రబాబు ఈ టీచర్ల ఇబ్బందుల గురించి పట్టించుకోవడంలేదు
- ఇప్పుడు వీళ్లకూడా టెట్ పరీక్షలో పాస్ కావాలని రూల్ పెట్టడం ఎంతవరకు కరెక్టు?"



తాడేపల్లి: టెట్ నిబంధనలతో టీచర్లు చాలా ఇబ్బందులు పడుతున్నా చంద్రబాబు పట్టించుకోకపోవడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మండిపడ్డారు. 2011 ముందు నుంచి టీచర్లుగా ఇప్పటికీ పనిచేస్తున్న వారు కూడా టెట్ పరీక్ష తప్పనిసరిగా పాస్ కావాలన్న నిబంధన పెట్టడంతో దాదాపు లక్షమందికి పైగా టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ మేరకు వైఎస్ జగన్ ఎక్స్‌లో స్పందిస్తూ.. "20-25 ఏళ్లకు పైబడి సబ్జెక్టు టీచర్లుగా కొనసాగుతున్న వీళ్లు, ఇప్పుడు అన్ని సబ్జెక్టుల సిలబస్‌తో ఉన్న టెట్ పరీక్ష పాస్‌కావాలని, అందులోకూడా గరిష్టంగా 60శాతం మార్కులు రావాలని చెప్పడం ఎంతవరకు సమంజసం? పైగా వీళ్లంతా అప్పట్లో డీఎస్సీ ఎలిజిబిలిటీ టెస్టులో ఉత్తీర్ణులు కాబట్టేకదా ఉద్యోగాలు వచ్చాయి? వారికి ఉద్యోగాలు ఇచ్చేటప్పుడు అప్పట్లో "టెట్" అనే పరీక్షే లేనప్పుడు, ఇప్పుడు వీళ్లకూడా టెట్ పరీక్షలో పాస్ కావాలని రూల్ పెట్టడం ఎంతవరకు కరెక్టు?" అని నిలదీశారు.

టీచర్లకు మానసిక ఒత్తిడి

టీచర్లందరికీ టెట్‌ను తప్పనిసరి చేస్తూ జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం 2011 నుంచి టెట్‌ను తప్పనిసరి చేస్తే, ఈ చట్టం రాకముందు నుంచే టీచర్ ఉద్యోగాలు చేస్తున్నవారికి "టెట్" పరీక్షను ఎందుకు తప్పనిసరి చేస్తున్నారంటూ వాళ్లు చేస్తున్న వాదనలో న్యాయం ఉంది కదా? అని వైఎస్ జగన్ అన్నారు. "అప్పట్లో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ పాస్ అయిన తర్వాతే వారికి ఉద్యోగం ఇవ్వడం జరిగింది కదా? టెట్ పరీక్ష నిబంధన కారణంగా ప్రమోషన్ల సమస్యే కాకుండా, చివరకు ఉద్యోగభద్రత లేకుండా చేస్తున్నారని, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని టీచర్లంతా వాపోతున్నారు. కానీ, చంద్రబాబు ఈ టీచర్ల ఇబ్బందుల గురించి పట్టించుకోవడంలేదు. చట్టాన్ని సవరించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలన్న ధ్యాసకూడా ఆయనకు లేకుండా పోయింది. టెట్ రాకముందు అంటే 2011కు ముందు సర్వీసులో ఉన్న టీచర్లందరికీ, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి, టీచర్లకు ఉపశమనం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాను. వారంతా అప్పట్లో కాంపిటేటివ్ పరీక్షలు పాస్ అయిన తర్వాతనే వారికి ఉద్యోగాలు వచ్చాయి అన్నది మరిచిపోకూడదు అనికూడా ఈ సందర్భంగా నేను గుర్తు చేస్తున్నాను మరొక్కసారి" అని చెప్పారు.

# ప్రంబనాన్ ఆలయంలో ప్రధాని మోదీ పూజలు.. 'ఓం నమః శివాయ'తో మార్మోగిన ప్రాంగణం

- ఇండోనేషియాలోని ప్రంబనాన్ హిందూ ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ
- ఆలయంలో 'ఓం నమః శివాయ' జపిస్తూ ప్రత్యేక పూజలు
- ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును సంయుక్తంగా ప్రారంభించిన ఇరు దేశాధినేతలు
- ఆలయ పరిరక్షణకు భారత్ సాయంపై ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందం
- భారత్-ఇండోనేషియా మధ్య రామాయణ, మహాభారతాల వారసత్వ బంధం ఉందన్న మోదీ




ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో భాగంగా బుధవారం చారిత్రక ప్రంబనాన్ ఆలయాన్ని సందర్శించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెలంగాణ విఫలం కాలేదు.. సఫలమై నిలిచింది - ప్రపంచ బ్యాంకు నివేదికపై కేటీఆర్ ఆనందం




తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ ప్రపంచ బ్యాంకు నివేదిక

ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేసిన కేటీఆర్

కేసీఆర్ దార్శనికత వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని వ్యాఖ్య

తెలంగాణ ప్రజలు బికారులు కాదన్న కేటీఆర్

## మావిగన్‌పై వైసీపీలో ఎలాంటి విభేదాలు లేవు: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి




- మావిగన్ వల్ల వైసీపీ నేతలు పార్టీని వీడుతున్నారనే ప్రచారంలో నిజం లేదన్న పెద్దిరెడ్డి
- ఇదంతా చంద్రబాబు, ఆయన అనుచరులు చేస్తున్న కుట్ర అని మండిపాటు

# తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి.. సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ

- తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి
- తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం
- మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు
- హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు




హైదరాబాద్,: కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం




- అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ చిన్నారి నిరంజన్ మృతి
- గత నెలలోనే హనుమకొండకు వెళ్లి నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- చిన్నారి మనల్ని విడిచి వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన

అమరావతి: జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, తెలంగాణలోని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ నిన్న రాత్రి కన్నుమూశాడు. ఈ వార్త తెలియగానే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సోషల్ మీడియా వేదికగా నిరంజన్‌ను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగాన్ని ఆయన వ్యక్తం చేశారు. "నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది.

## తిరుమలలో జులై, ఆగస్ట్, సెప్టెంబర్‌లలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు.. పూర్తి వివరాలివే!




- జులై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలపై ఆంక్షలు
- పలు ఉత్సవాలు, పర్వదినాల కారణంగా టీటీడీ కీలక నిర్ణయం
- సెప్టెంబర్‌లో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎక్కువ రోజులు రద్దు
- సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసిన తిరుమల దేవస్థానం

# తిరుమలలో జులై, ఆగస్ట్, సెప్టెంబర్‌లలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు.. పూర్తి వివరాలివే!



అమరావతి: తిరుమల శ్రీవారి దర్శనానికి రాబోయే మూడు నెలల్లో ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న భక్తులకు టీటీడీ ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. జులై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో పలు పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆయా తేదీలలో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. సామాన్య భక్తులకు పెద్దపీట వేసే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ పేర్కొంది. ముఖ్యంగా సిఫార్సు లేఖలపై ఆధారపడి దర్శనానికి వచ్చే భక్తులు, ఈ మార్పులను గమనించి తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సూచించింది.

నెలల వారీగా రద్దు వివరాలు

జులై నెల: ఈ నెలలో నాలుగు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలకు అంతరాయం కలగనుంది. తిరుమల ఆలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. జులై 14 (ఆదివారం): కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా. జులై 17 (బుధవారం): ఆణివార ఆస్థానం పర్వదినం కారణంగా. జులై 19 (శుక్రవారం): ఆండవన్ ఆశ్రమ స్వామీజీకి పెద్ద మర్యాద కార్యక్రమం నేపథ్యంలో. జులై 29 (సోమవారం): జీయర్ స్వాముల చాతుర్మాస సంకల్పం సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు.

ఆగస్ట్ నెల: ఆగస్ట్ నెలలో శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ కారణంగా రెండు రోజుల పాటు వీఐపీ దర్శనాలను నిలిపివేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. ఆగస్ట్ 22 (గురువారం): పవిత్రోత్సవాలకు అంకురార్పణ సందర్భంగా. ఆగస్ట్ 24 (శనివారం): పవిత్రాల సమర్పణ కార్యక్రమం ఉన్నందున వీఐపీ బ్రేక్ దర్శనం ఉండదు.

సెప్టెంబర్ నెల: ఏటా అంగరంగ వైభవంగా జరిగే శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్‌లో జరగనున్నాయి. దీంతో ఈ నెలలో ఎక్కువ రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు కానున్నాయి. సెప్టెంబర్ 8 (ఆదివారం): బ్రహ్మోత్సవాల ముందు నిర్వహించే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా. సెప్టెంబర్ 14 (శనివారం): బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ సందర్భంగా. సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 23 వరకు: బ్రహ్మోత్సవాలు జరిగే 9 రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు.

సిఫార్సు లేఖలపై స్పష్టత

వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన తేదీలకు ముందు రోజులలో, ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ తేల్చి చెప్పింది. అయితే, ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే అత్యంత ప్రముఖులకు మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొంది. పర్వదినాల సమయంలో తిరుమలకు భక్తుల రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున, సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు. కావున, తిరుమల యాత్రకు సిద్ధమయ్యే భక్తులు పైన పేర్కొన్న తేదీలను జాగ్రత్తగా గమనించి, అనవసర ఇబ్బందులు పడకుండా తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## లష్కరే టాప్ కమాండర్ జాకీర్ ను కాల్చి చంపిన బలగాలు

ఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల గుండెల్లో వణుకు పుట్టిస్తూ భారత భద్రతా దళాలు మరో అదిరిపోయే సక్సెస్ సాధించాయి. షోపియాన్ జిల్లాలో గత ఐదు రోజులుగా సాగుతున్న హై-వోల్టేజ్ 'కౌంటర్ టెర్రరిజమ్' ఆపరేషన్‌లో మోస్ట్ వాంటెడ్, లష్కరే తోయిబా (హామ) టాప్ కమాండర్ జాకీర్ గనాయ్ హతమయ్యాడు. భద్రతా బలగాలు అతడిని కాల్చి చంపాయి. ఘటనా స్థలం నుంచి అతడి మృతదేహాన్ని కూడా సైన్యం స్వాధీనం చేసుకుంది. అసలు ఈ ఆపరేషన్ ఎలా స్టార్ట్ అయిందంటే.. జులై 3న షోపియాన్‌లోని తోటల ప్రాంతంలో అమర్చిన నిఘా కెమెరాల్లో ఈ టాప్ కమాండర్ జాకీర్ గనాయ్‌తో పాటు లతీఫ్ అనే మరో ఉగ్రవాది కదలికలు రికార్డయ్యాయి. ఇంకేముంది.. పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగిన భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జాయింట్ టీమ్‌గా ఏర్పడి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.

### బోనులో చిక్కిన ఉగ్రవాదులు...

దట్టమైన తోటల గుండా ఉగ్రవాదులు ఎస్కేప్ కాకుండా ఉండేందుకు ఆర్మీకి చెందిన స్పెషల్ విభాగానికి చెందిన 'విక్టర్ ఫోర్స్' (ఎఊషిశీతీ ఖీశీతీషవ) రంగంలోకి దిగి, బయటకు వెళ్లే దారులన్నింటినీ పూర్తిగా బ్లాక్ చేసింది. రాత్రి వేళల్లో కూడా చీకటిని చీల్చుకుంటూ ఆపరేషన్ సాగించేందుకు స్పెషల్ లైటింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు వాళ్లు నక్కిన చోటికి చేరువవుతున్న సమయంలో... ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. మన జవాన్లు ధీటుగా బదులివ్వడంతో లష్కరే టాప్ కమాండర్ జాకీర్ గనాయ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ప్రస్తుతానికి అక్కడ దాక్కున్న రెండో ఉగ్రవాది లతీఫ్ కోసం దళాలు వేటను మరింత ముమ్మరం చేశాయి. కశ్మీర్ లోయలో 'లష్కరే' నెట్‌వర్క్‌కు ఇది కోలుకోలేని దెబ్బ అని చెప్పొచ్చు.

## ఎన్నికల విజయంపై న్యాయపోరు.. సీఎం విజయ్‌కు కొత్త చిక్కులు

మొదటి పేజి తరువాయి

పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ మేరకు స్పందించింది న్యాయస్థానం. సీఎం విజయ్, కేంద్ర ఎన్నికల సంఘం మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. అలాగే సదరు పిటిషన్లపై కొన్ని ప్రక్రియాపరమైన అంశాలనూ లేవనెత్తుతూ, వాటిని సరిదిద్దుకోవాలని జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం సూచించింది. పెరంబూర్‌లో విజయ్ చేతిలో ఓడిన డీఎంకేకు చెందిన ఆర్‌డీ.శేఖర్, అదే నియోజకవర్గానికి చెందిన దినేశ్, లక్ష్మీనరసింహన్ అనే మరో ఇద్దరు ఓటర్లతో కలిసి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తిరుచ్చి ఈస్ట్ ఫలితాన్ని సవాల్ చేస్తూ డీఎంకేకు చెందిన ఎస్.ఇనిగో ఇరుదయరాజ్ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. విజయ్ ఎన్నికల ప్రచారంలో చిన్నారులను భావోద్వేగపూరితంగా ఉద్దేశించి, వారి ద్వారా కుటుంబ సభ్యుల ఓట్లను ప్రభావితం చేసేలా ప్రసంగించారని ఆరోపించారు. ఇది ఎన్నికల ప్రచారంలో చిన్నారులను వినియోగించరాదన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సాక్ష్యంగా చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో ఏప్రిల్ 21న విజయ్ ప్రచార ప్రసంగానికి సంబంధించిన వీడియోలను సమర్పించారు. అదేవిధంగా ప్రచార గీతాల రూపకల్పనకు సంబంధించిన ఖర్చులను ఎన్నికల వ్యయాల్లో చూపలేదని, ఆస్తుల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను బకాయిల వివరాల్లోనూ వ్యత్యాసాలున్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అలాగే ఏప్రిల్ 19న సెయింట్ ఆంటోనీ చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న అంశాన్నీ ప్రస్తావించారు. మరోవైపు.. విల్లివాక్కం ఎమ్మెల్యే, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఆధవ్ అర్జున్ ఎన్నికల విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పైనా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అలాగే తిరువణ్ణామలై ఎమ్మెల్యే ఈవీ.వేలు, టీవీకేలో చేరిన మాజీ డీఎంకే ఎమ్మెల్యే ఎస్.జయకుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యే తరగై కుత్‌బర్ట్ ఎన్నికల విజయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా న్యాయస్థానం వారికి నోటీసులు పంపింది. కొందరు ప్రతివాదులు జులై 21లోపు తమ సమాధానాల్ని తెలపాలని ఆదేశించింది.

## రావణ్ అరెస్ట్ పై కొడాలి నాని సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

ప్రజల నోరు నొక్కేందుకు ఈ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా ప్రయత్నిస్తోంది" అని కొడాలి నాని మండిపడ్డారు. రావణ్‌ను ఏకంగా ఉప్మా చట్టం, ఇడ్లీ చట్టం అంటూ ఏదో ఒక కొత్త చట్టాన్ని (ఖ్యూాాా చట్టాన్ని ఉద్దేశించి) తెరపైకి తెచ్చి జైలుకు పంపించారని ఆయన ఎద్దేవా చేశారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని చంద్రబాబు, లోకేశ్, వారి అనుకూల మీడియా సంబోధిస్తోందని కొడాలి నాని మండిపడ్డారు. "మాది గొడ్డలి పార్టీ కాదు. పేదల పక్షాన నిలిచే సంక్షేమ పార్టీ. నిజానికి నీది 'బూడిద పార్టీ'. ఇది 'బూడిద ప్రభుత్వం' అని రాష్ట్ర ప్రజలు మాట్లాడుకుంటున్నారు. మీకు వ్యతిరేకంగా ఉన్నవాళ్లను పోలీస్ స్టేషన్లలో పెట్టి తగలబెట్టి బూడిద చేసే రకం మీది. రాబోయే రోజుల్లో మీ పార్టీకి, మీకు ఆ బూడిదే మిగులుతుంది" అని తీవ్రంగా హెచ్చరించారు. రావణ్ మాట్లాడిన వ్యాఖ్యలు ఇప్పుడేం కొత్తవి కావని... గతంలో సీఎంలు, డిప్యూటీ సీఎంలుగా ఉన్నవారే అంతకంటే భయంకరమైన భాష వాడారని నాని అన్నారు. "గత ఏడాది కాలంగా పవన్ కల్యాణ్‌పై రావణ్ పోస్టులు పెడుతున్నాడు. అందుకే కక్ష కట్టి జనసేన శ్రేణులు అతనిపై కేసులు పెట్టి, స్టేషన్ల చుట్టూ తిప్పి దాడులకు దిగారు. కోర్టులు బెయిల్ ఇస్తుండటంతో తట్టుకోలేక, ఈ దొంగ చట్టాలు తెచ్చి లోపల వేశారు. గతంలో మేము అధికారంలో ఉన్నప్పుడు జగన్ మీద, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా మా మీద రావణ్ విమర్శలు చేశాడు. కానీ, మేమెప్పుడూ ఇలా అణచివేయాలని చూడలేదు" అని చెప్పారు. రావణ్‌ను వైసీపీ మనిషిగా చిత్రీకరించేందుకు తెలుగుదేశం అనుకూల 'పేటీఎం బ్యాచ్' మీడియా ప్రయత్నిస్తోందని కొడాలి నాని ఆరోపించారు. "రావణ్ ఎప్పుడూ చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణలకు అనుకూలంగానే ఉంటాడు. వారిని ఒక్క మాట కూడా అనడు. అందుకే టీడీపీ సైలెంట్‌గా ఉంది. కానీ ఏబీఎన్ రాధాకృష్ణను, టీవీ5 బీఆర్ నాయుడిని, మహాన్యూస్ ఐబీఆర్లను తిట్టాడు. ఆ బూతులు తిట్టించుకున్న పచ్చ మీడియానే... ఇప్పుడు రావణ్‌పై లేనిపోని తప్పుడు వీడియోలు వండి వారుస్తూ, ఆ బురదను వైసీపీకి రుద్దాలని చూస్తోంది" అని కొడాలి నాని తీవ్రంగా విమర్శించారు.

## నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం, అలాగే సీబీఐ విచారణకు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి.. సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ

మొదటి పేజి తరువాయి



ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు

సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్ : బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు, మహేశ్ కొండూరు : అమెరికా ప్రభుత్వ సలహాదారు మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ, అమిత్ మెహ్రా : ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ, దిలెక్ , నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ, థామస్ ఫ్రోలిక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు, సెంథిల్ తొండమాన్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు( శ్రీలంక) సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

## ప్రంబనాన్ ఆలయంలో ప్రధాని మోదీ పూజలు.. 'ఓం నమః శివాయ'తో మార్మోగిన ప్రాంగణం

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో భాగంగా బుధవారం చారిత్రక ప్రంబనాన్ ఆలయాన్ని సందర్శించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ప్రధాని మోదీ 'ఓం నమః శివాయ' నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఈ ఆధ్యాత్మిక క్షణాలకు సంబంధించిన వీడియోను ప్రధాని తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ, అధ్యక్షుడు ప్రబోవో సంయుక్తంగా ప్రంబనాన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ ఆలయ పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు భారత్ ఆర్థిక, సాంకేతిక సహకారం అందించనుంది. ఇందుకు సంబంధించి ఇరు దేశాల మధ్య మంగళవారం కీలకమైన ఒప్పందం (లెటర్ ఆఫ్ ఇంటెంట్) కుదిరింది. ఆలయానికి వెళ్తున్న మార్గంలో ఇరు దేశాల జాతీయ జెండాలతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. 10వ శతాబ్దంలో నిర్మించిన ప్రంబనాన్, ఇండోనేషియాలోనే అతిపెద్ద హిందూ దేవాలయాల సముదాయం. ప్రధానంగా ఇది త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు అంకితం చేయబడింది. ఈ సముదాయం నడిబొడ్డున 47 మీటర్ల (154 అడుగులు) ఎత్తుతో శివాలయం అత్యంత ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ఆలయ గోడలపై రామాయణ గాథలను వర్ణించే అద్భుతమైన శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. ఇది ఒకప్పుడు దాదాపు 240 చిన్న, పెద్ద ఆలయాలతో ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ క్షేత్రాలలో ఒకటిగా విలసిల్లింది. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్-ఇండోనేషియా మధ్య కేవలం సముద్ర సంబంధమే కాదని, శతాబ్దాల నాటి చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని అన్నారు. "మన సంబంధాల మూలాలు రామాయణ, మహాభారతాల ఉమ్మడి వారసత్వంలో ఉన్నాయి. బోరోబుదూర్, ప్రంబనాన్ వంటి అద్భుత కట్టడాలు మన అనుబంధానికి ప్రతీకలు" అని ఆయన ఇండోనేషియా పార్లమెంటులో ప్రసంగిస్తూ పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, అధ్యక్షుడు ప్రబోవోతో చర్చలు జరపడంతో పాటు ప్రవాస భారతీయులతో కూడా సమావేశమయ్యారు.

## తెలంగాణ విఫలం కాలేదు.. సఫలమై నిలిచింది - ప్రపంచ బ్యాంకు నివేదికపై కేటీఆర్ ఆనందం

హైదరాబాద్: 'తెలంగాణ దివాలా తీసింది' అంటూ దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు గట్టి కౌంటర్ పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచ బ్యాంకు' ఇచ్చిన తాజా నివేదికలో... తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ పేర్కొనడంపై కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే ఈ ఘనత సాధించిన టాప్-5 అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ నిలవడం మనకందరికీ గర్వకారణమంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పరోక్షంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దార్శనిక పాలన వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. పదేళ్ల కిందట వరకు దరిద్రం తాండవించిన ప్రాంతం కాస్తా... నేడు ధనిక రాష్ట్రంగా మారిందని అన్నారు. తెలంగాణ ప్రజలు బికారులు కాదని, సిరిసంపదలతో తులతూగే తెలంగాణ తల్లి బిడ్డలని వ్యాఖ్యానించారు. తమ చెమటను, నైపుణ్యాన్ని, మేధస్సును ధారపోసి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నామని చెప్పారు. "తెలంగాణ వస్తే ఏం పెరిగింది అని అడిగేవారు చూడాలి. ఇక్కడ జాతి సంపద పెరిగింది, జనం ఆదాయం అద్భుతంగా వృద్ధి చెందింది" అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా ముందుకు దూసుకెళ్లిందని కేవలం జాతీయ నివేదికలే కాదు, ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ సంస్థలే స్టాంప్ వేసి చెబుతున్నాయన్నారు. రాజకీయ స్వార్థం కోసం ప్రతిదానికీ 'దివాలా.. దివాలా' అంటూ మైకుల ముందు అరిచే వాళ్ల నోళ్లు మూయించడానికి ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఈ తాజా నివేదికే ఒక పవర్ ఫుల్ సమాధానమని పేర్కొన్నారు.

## మావిగన్‌పై వైసీపీలో ఎలాంటి విభేదాలు లేవు - పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


అమరావతి: 'మావిగన్' రాజధాని ప్రతిపాదనపై వైసీపీ నేతల్లో తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించారు. "మావిగన్ అంశంపై మా పార్టీలో ఎలాంటి విభేదాలూ లేవు. ఈ విషయంలో పార్టీ నేతలు వైసీపీని వీడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారం అంతా పచ్చి అబద్ధం. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అనుచరులు కలిసి చేస్తున్న కుట్రపూరిత ప్రచారం మాత్రమే" అని ఆయన అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా తిరుపతిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ త్రీ-సిటీ (మావిగన్) మెగా రీజియన్ వల్ల వెనుకబడిన ప్రాంతాలన్నీ అద్భుతంగా అభివృద్ధి చెందుతాయని పెద్దిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నం, గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలందరికీ ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. "మావిగన్ ప్రతిపాదనపై ఎవరికైనా అసంతృప్తి ఉందీ అంటే... అది కేవలం చంద్రబాబుకు మాత్రమే. ప్రజల్లో మాత్రం దీనికి పూర్తి ఆమోదం, మద్దతు ఉన్నాయి" అని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో అమరావతి ప్రాజెక్టుపై మండిపడుతూ... అమరావతి పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి వాటిని పూర్తిగా వృథా చేస్తున్నారని, ప్రజలకు అస్సలు ఉపయోగపడని రీతిలో భారీ ఖర్చులు పెడుతూ రాష్ట్ర భవిష్యత్తును భారం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల హాట్ టాపిక్‌గా మారిన యూట్యూబర్ 'రావణ్' వ్యవహారంపై పెద్దిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. రావణ్ వైసీపీకి చెందిన వ్యక్తి కాదని స్పష్టం చేశారు. ఆయన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారని... ఆయన్ను తీసుకొచ్చి మాట్లాడించాల్సిన అవసరం వైసీపీకి లేదన్నారు. చిత్తూరు జిల్లాలో ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ సక్రమంగానే సాగుతున్నప్పటికీ... సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో మాత్రం తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల కోసమే జీవించిన అసలైన ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా జనం గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నాడు ఆయన తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి విప్లవాత్మక పథకాలు తెలుగు రాష్ట్రాల్లోని నిరుపేదలకు ఒక వరంలా మారాయని చెప్పారు.

## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం

మొదటి పేజి తరువాయి

"నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్దిరోజుల క్రితమే హనుమకొండలో వాళ్ల ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా నా కళ్లముందే కదలాడుతున్నాయి. అంతటి భయంకరమైన అనారోగ్యంతో పోరాడుతూ కూడా నన్ను చూడగానే ఆ చిన్నారి ముఖంలో విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం. శరీరం వ్యాధితో క్షీణిస్తున్నా... మనసు నిండా కొండంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అంతటి ధైర్యశాలి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోతున్నా. ఆ చిన్నారి చూపిన ప్రేమ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది" అంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు. గత నెలలోనే నిరంజన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా హనుమకొండ వెళ్లి అతడిని పరామర్శించారు. ఆ సమయంలో నిరంజన్‌ను గుండెలకు హత్తుకుని, తిరుమల ప్రసాదం ఇచ్చి, సెల్ఫీ కూడా దిగారు. తనకు ఒక కుక్కపిల్ల కావాలని అడగ్గానే... ఆ రోజే కుక్కపిల్లను పంపించారు. అంతేకాదు, "నేను 'ఓజీ 2' తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్.. ఇద్దరం కలిసి సినిమా చూద్దాం" అని పవన్ మాట ఇచ్చారు. కానీ, ఈ లోపే చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఫ్యాన్స్ ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు, బాలీవుడ్ రియల్ హీరో సోనూ సూద్ సైతం నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆ కుటుంబానికి తానున్నానంటూ కొండంత ధైర్యాన్ని అందించారు.

## ట్రంప్ సంచలన ప్రకటనతో భగ్గుమన్న ముడి చమురు ధరలు



ఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇవాళ చమురు ధరలు 6 శాతానికి పైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా, అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడ్ అయింది. 'ఐఏఎన్ఎస్' తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సైతం 20 పైసలు క్షీణించి 95.16 వద్ద కొనసాగుతోంది.

## వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసీపీదే విజయం: సజ్జల రామకృష్ణారెడ్డి



అమరావతి: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సహా పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ... వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు కోట్లాది మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని కొనియాడారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ లాంటి పథకం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎంతోమంది పేద విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగారని అన్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అసలైన రాజకీయ వారసత్వాన్ని జగన్ సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నారని సజ్జల తెలిపారు. ఎన్ని సవాళ్లు, కుట్రలు ఎదురైనా జగన్ తన పట్టుదల, దార్శనికతతో జనం గుండెల్లో చెరగని విశ్వాసాన్ని సంపాదించుకున్నారన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై సజ్జల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు నాయకత్వంలోని అధికార కూటమి మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. ప్రభుత్వంపై జనం తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, తప్పుడు వాగ్దానాలు చేసిన కూటమి నేతలు ఇప్పుడు ప్రజల ముందుకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా క్షేత్రంలో త్వరలోనే వీరికి బుద్ధి వస్తుందని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ మళ్లీ జయకేతనం ఎగురవేయడం ఖాయమని... గతం కంటే అద్భుతమైన పాలనను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## ఏపీకి కొరియా పెట్టుబడులే లక్ష్యం.. బుసాన్‌లో మంత్రి లోకేశ్ కీలక భేటీలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నేడు బుసాన్ నగరంలో కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వానికి, కొరియా కంపెనీలకు మధ్య వారధిగా నిలిచేందుకు ఏపీఈడీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అపెక్స్-కొరియా' సహాయ కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై అక్కడి ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఉన్నతస్థాయి బృందంతో సమావేశమయ్యారు.

### అమరావతిలో బ్రాంచ్ పెట్టండి: బీఎన్‌కేకు లోకేశ్ పిలుపు

బుసాన్‌లో బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బీఎన్‌కే క్యాపిటల్ సీఈవో సన్ దే జిన్‌తో పాటు పలువురు పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అపార అవకాశాలను వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న అమరావతిలో బీఎన్‌కే ఫైనాన్షియల్ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్రంలోని స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అండగా నిలిచేందుకు బీఎన్‌కే వెంచర్ క్యాపిటల్ సంస్థ.. ఏపీలోని ఆర్టీఐహెచ్‌లో భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి, పారిశ్రామిక పార్కులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ అందించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం వంటి రంగాల్లోని తమ క్లయింట్‌లను ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై బీఎన్‌కే ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. తమ గ్రూప్‌లో మూడు బ్యాంకులు, సెక్యూరిటీస్, క్యాపిటల్, అసెట్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాలు ఉన్నాయని, తమకు కొరియాలో 398, విదేశాల్లో 75 శాఖలు ఉన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఆస్తుల విలువ సుమారు 101.9 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 9.64 లక్షల కోట్లు) ఉండటం గమనార్హం.

కొరియా సంస్థలకు 'అపెక్స్' అండ

అంతకుముందు మంత్రి లోకేశ్ బుసాన్‌లో 'అపెక్స్-కొరియా' (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్-కొరియా) పేరుతో ఏర్పాటు చేసిన పెట్టుబడిదారుల సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కొరియా సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తుందని లోకేశ్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న కొరియా కంపెనీలకు కూడా ఈ కేంద్రం అవసరమైన సేవలు అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీఈడీబీ సీఈవో సగిలి షన్మోహన్, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, పరిశ్రమలశాఖ కమిషనర్ శుభం బన్సాల్ పాల్గొన్నారు.

# అక్రమ ప్రాజెక్టు లను అడ్డుకోవాలి.





అలంపూర్ (శివసూర్య )అన్ని పార్టీల తో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి.ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నీటి దోపిడీ ని అరికట్టాలి. సాగు నీటి విషయంలో అన్యాయం జరిగితే పోరు బాట తప్పదు. సొంత జిల్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని కోరారు.రాజోలి బండ ను సందర్శించినఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి.కర్ణాటక పరిధిలో ఉన్న రాజోలి డైవర్షన్ స్కీమ్ ఆర్ డి ఎస్ ను బుధవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, సారథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక పరిధిలో అక్రమంగా ప్రాజెక్ట్ లను నిర్మించి, తెలంగాణ కు సాగునీరు అందకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. దీనికి తోడు ఏపీ జలచోర్యం కు పాల్పడుతున్నారని, దీంతో దిగువన ఉన్న తెలంగాణ లోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. కనీసం 5 టీఎంసీలు నీరు కూడా అందటం లేదని అన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కర్ణాటక ప్రభుత్వం తో మాట్లాడటం తో పాటు, అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేయాలనీ, కేంద్ర జల సంఘం తో మాట్లాడి నీటి వాటాను సాధించాలన్నారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోరుబాట తప్పదని హెచ్చరించారు. జిల్లా రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని వారి తరపున పోరాడి సాగు నీరు అందే వరకు ఉద్యమిస్తూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి,చిట్టెం రామ్మోహన్ రెడ్డి,అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్,మరియు బీఆర్ఎస్ నాయకులు బాస్ హనుమంతు,పరమేశ్వర్ రెడ్డి,నాగేశ్వర్ రెడ్డి,బాలకృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, రఘు రెడ్డి, నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య,కార్యకర్తలు.

# అక్రమ ప్రాజెక్టులను ఆపాలి. బిఆర్ఎస్ పార్టీ జోగులాంబ గద్వాల ఇంచార్జ్ హనుమంత నాయుడు.



గద్వాల (శివసూర్య )రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ను మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ గార్లతో కలిసి,సందర్శించిన గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు. కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి మండల పరిధిలోని రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ వద్ద కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నిర్మాణం చేస్తున్న ప్రాజెక్ట్ లను మాజీ మంత్రివర్యులు డా.శ్రీనివాస్ గౌడ్ గారు,లక్ష్మారెడ్డి గారు,ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రాంరెడ్డి ,నవీన్ కుమార్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు,బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధుల బృందంతో కలిసి, బాసు హనుమంతు నాయుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలు నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను ఆపాలని,లేకుంటే ప్రాజెక్టులను అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాజన్న జయంతి రోజు బాధిత కుటుంబానికి 25 వేల చేయూత



మంత్రాలయం,శివసూర్య, జూలై 8:ఏరువాక పౌర్ణమి రోజు నది స్నానానికి వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన కురువ సురేష్ కు చెందిన రెండు ఎద్దులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఈ సహాయం అందించినట్లు ప్రదీప్ రెడ్డి తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి రైతుకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు భీమిరెడ్డి విశ్వనాథరెడ్డి, మంత్రాలయం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, గోరుకలు కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న బాటలోనే మా ప్రస్థానం: ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మంత్రాలయం,శివసూర్య, జూలై 8: మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 సేవల ద్వారా వైఎస్ఆర్ పేదలకు నిజమైన అండగా నిలిచారని అన్నారు. వైఎస్ఆర్ చూపిన బాటలోనే తమ ప్రస్థానం కొనసాగుతుందని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన నాయకుడు వైయస్సార్ : ప్రదీప్ రెడ్డి



మంత్రాలయం,శివసూర్య, జూలై 8:దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు మంత్రాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. వైసిపి కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అభూతపూర్వ సంక్షేమ పథకాలతో వైఎస్ఆర్ పేద ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారని కొనియాడారు. వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి కుటుంబానికి మేలు చేసేందుకు పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి రైతు, పేద కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు భీమిరెడ్డి విశ్వనాథరెడ్డి, మంత్రాలయం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, గోరుకలు కృష్ణస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజా సమస్యకు తక్షణ పరిష్కారం: యువజన సమాఖ్య వినతితో వీధి దీపాలు



మంత్రాలయం,శివసూర్య, జూలై 8:. ప్రధాన రహదారి నుంచి రాఘవేంద్రనగర్ కు వెళ్లే మార్గంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళ ప్రజలు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అఖిల భారత యువజన సమాఖ్య మండల కార్యదర్శి ఎం. రాజు పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.ప్రజా సమస్యపై సానుకూలంగా స్పందించిన అధికారులు వెంటనే చర్యలు చేపట్టి రాఘవేంద్రనగర్ మార్గంలో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై అఖిల భారత యువజన సమాఖ్య ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించిన పంచాయతీ అధికారులకు అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య మండల నాయకులు, రాఘవేంద్రనగర్ గ్రామ యువకులు పాల్గొన్నారు.

# భద్రతకు పెద్దపీట: మంత్రాలయం మఠంలో అధికారుల సమీక్ష



మంత్రాలయం,శివసూర్య, జూలై 8: రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో భద్రతా ఏర్పాట్లపై పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.స్వామీజీ సూచనల మేరకు ఆర్మూర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ జావీద్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, కమ్యూనికేషన్ ఎస్ఐ సుధాకర్, మంత్రాలయం సర్కిల్ ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, ఎస్సై మల్లికార్జున, మఠం ఉన్నతాధికారులు సంయుక్తంగా మఠం ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వదర్శనం దర్శనం క్యూలైన్లు, విఐపి క్యూ లైన్ ,పరిమళ పుష్కరిణి,అన్నపూర్ణ భోజనశాల, తుంగభద్ర నది తీర ప్రాంతాలు, ప్రధాన ద్వారాల వద్ద భద్రతా ఏర్పాట్లను అధికారులు నిశితంగా పరిశీలించారు. రద్దీ సమయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా మఠం అధికారులు మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని మఠం పరిసరాల్లో 24 గంటల పాటు గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు.సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు భక్తుల రక్షణకు తమ వంతు కృషి చేస్తామని, అవసరమైన చోట్ల అదనపు సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మఠం కార్యనిర్వాహక అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు



హాలహర్వి, శివసూర్య, జూలై 8:ఈరోజు హాలహర్వి మండలంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి 77వ జయంతి వేడుకలను ఆలూరు వైకాపా ఎమ్మెల్యే శ్రీ బుసినే విరూపాక్షి గారి ఆదేశాల మేరకు హాలహర్వి మండల కన్వీనర్ రామిరెడ్డి మరియు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రెండు రూపాయలకే బియ్యం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పావలా వడ్డీ, సాగునీటి కోసం జలయజ్ఞం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.అలాగే, ఆయన ఆశయాలను ఆయన కుమారుడు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారు కొనసాగిస్తూ అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాల పరిరక్షణ కోసం రానున్న రోజుల్లో మరోసారి జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సొసైటీ చైర్మన్లు, మాజీ సర్పంచులు,యువజన నాయకులు, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, గంగాధర్, గోపాల్,శీనప్ప, కృష్ణ, గూళ్యం ఎల్లప్ప,ధరగప్ప, ఖిలెహాల్ నెట్టేప్ప, రాముడు, అంజి, సూరి, కురువ బజారప్ప ,అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలు తప్పదు: మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున హెచ్చరిక



మంత్రాలయం,శివసూర్య, జూలై 8:మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామంలో ప్రజలకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున తన సిబ్బందితో కలిసి సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మద్యం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఎస్ఐ హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపేటప్పుడు పట్టుబడితే కేసు నమోదుతో పాటు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే ప్రాణాలకే ప్రమాదమని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే మీ కుటుంబం వీధిన పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కారు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.అదేవిధంగా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఇవ్వవద్దని సూచించారు. అనుమానం వస్తే వెంటనే 1930 లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి - వైస్సార్సీపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ.





మంత్రాలయం, శివసూర్య, జూలై 8: ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్నికలకు ముందు న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వైస్సార్సీపీ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ ఎం.కె గురు రాజారావు డిమాండ్ చేశారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు గారు కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినప్పటికీ ఇంతవరకు పట్టించుకోవడం లేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం పథకం కింద స్టైఫండ్ గా రూ. 5 వేలు క్రమం తప్పకుండా 5 సంవత్సరాలు నేరుగా జూనియర్ న్యాయవాదుల అకౌంట్ లలో వేశారని, చంద్రబాబు నాయుడు గారు జూనియర్ న్యాయవాదులకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడ ఇవ్వలేదని అన్నారు. అలాగే న్యాయవాదులపై అక్కడక్కడా దాడులు జరుగుతున్న నేపథ్యంలో దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ ను అమలు చేస్తున్నారని, మన పక్క రాష్ట్రమైన తెలంగాణలో కూడా అమలుచేస్తున్నారని ఆ యాక్ట్ ను మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నారా చంద్రబాబు నాయుడు గారు నేడు బనగానపల్లెలో నిర్వహిస్తున్న సభలో న్యాయవాదులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు అయినప్పటికీ ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడం పట్ల నిరసనగా బనగానపల్లె అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ తీర్మాణం మేరకు న్యాయవాదులందరు 9, 10 రెండు రోజులు తమ విధులను బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు స్పందించి న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# యోగేష్ ప్రభుజీకి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూలై 8:భారతీయ జనతా పార్టీ దేవాదాయ--ధార్మిక విభాగం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులైన పూజ్య శ్రీ యోగేష్ ప్రభుజీకి జోగులాంబ గద్వాల జిల్లా అర్చక సంఘం తరపున జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, యోగేష్ ప్రభుజీకి దేవాదాయ--ధార్మిక విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. గతంలో అర్చకుల సంక్షేమం, సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన విశేషంగా సేవలందించారని కొనియాడారు.అర్చక కుటుంబాల సంక్షేమం, ధార్మిక చైతన్యం, సమాజ హితం కోసం యోగేష్ ప్రభుజీ మరింత సమర్థవంతంగా సేవలందిస్తారనే పూర్తి విశ్వాసం తమకు ఉందని తెలిపారు. ఈ నియామకం ద్వారా దేవాదాయ--ధార్మిక రంగానికి మరింత బలం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా యోగేష్ ప్రభుజీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వారి సేవలు మరింత విస్తరించి సనాతన ధర్మానికి, అర్చక సమాజానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## జనసంద్రంగా మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

ఐదో రోజుకు విశేష స్పందన.. 4,300 మందికిపైగా సందర్శన --
64 మందికి విజయవంతంగా శుక్లాల శస్త్రచికిత్సలు




ఆమనగల్లు, జూలై 8: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి లో శ్రీ దేవకి ఫంక్షన్ హాల్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ప్రముఖ శంకర నేత్రాలయ వైద్య బృందం నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఐదో రోజుకు చేరుకుని ప్రజల నుంచి అపూర్వ స్పందన పొందుతోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందిస్తూ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది.ఐదు రోజుల వ్యవధిలో 4,300 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 2,520 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు, 1,618 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ, 142 మంది కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపిక చేయబడ్డారు. ఇప్పటికే రెండు రోజులుగా నిర్వహించిన శస్త్రచికిత్సల్లో 64 మంది రోగులకు విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి చేశారు.శిబిరాన్ని సందర్శించిన ఎస్ఐ శేఖర్ఐదో రోజు శిబిరాన్ని తలకొండపల్లి ఎస్ఐ శేఖర్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిగా ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకోలేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాలు, శుక్లాల



శస్త్రచికిత్సలు అందించడం గొప్ప సేవ అని కొనియాడారు. ప్రజాసేవను బాధ్యతగా భావిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.10వ తేదీ వరకు పరీక్షలు -- 12వ తేదీ వరకు శస్త్రచికిత్సలుఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన తమకు ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు ఉచిత కంటి పరీక్షలు, 12వ తేదీ వరకు కంటి శుక్లాల శస్త్రచికిత్సలు కొనసాగనున్నందున తలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఐదో రోజు గణాంకాలుశిబిరాన్ని సందర్శించిన వారు -- 1,100 మందికి పైగాఉచిత కంటి పరీక్షలు -- 710 మందికి పైగాఉచిత కంటి అద్దాల పంపిణీ -- 440 మందికి పైగాశుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపిక -- 30 మందిరెండో రోజు శస్త్రచికిత్సల్లో -- 34 మంది రోగులకు విజయవంతంగా ఆపరేషన్లుఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు విజయ్ కుమార్, రఘు, యాదయ్య, మల్లేష్, శ్రీపతి, శేఖర్, శివ కాకి, భాస్కర్, సాయి కిరణ్, శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ లకు సహకరిస్తున్న బిజెపి నాయకుడు











**నారాయణపేట జూలై 8:నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ సర్వే లో బి ఎల్ ఓ లకు బిజెపి నాయకులు సహకరిస్తున్నారు.పట్టణంలోని 15 వ వార్డులో నిర్వహిస్తున్న సర్వే లో పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి నక్క సత్యనారాయణ ఓటర్ల ఫారాలు నింపుతూ బి ఎల్ ఓ లకు సహకరిస్తున్నారు. ఏ ఒక్క ఓటు చేసారా కుండా దొంగ ఓట్లు నమోదు కాకుండా జాగ్రత తీసుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ బండి.రాజేశ్వరి, సూపర్వేజర్.అశోక్ .బి ఎల్ ఓ.జ్యోతిర్మయి ఆశ వర్కర్.హైమావతి, రఘు పాల్గొన్నారు.**

## సి ఎం,మంత్రి,ఎమ్మెల్యే లకు కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం



నారాయణపేట జూలై 8:నారాయణపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు రైతు భరోసా నిధులను సకాలంలో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు భరోసా నిధులను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలి అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కర్రే వెంకటేష్ గౌడ్,మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి పాటు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు మహేష్, రాజ్ ఘుట్, జిల్లా అధికార ప్రతినిధి వకీల్ సంతోష్, మాజీ మార్కెట్ చైర్మన్ సరేఫ్ నాగరాజు, అమీరుద్దీన్ అడ్వకేట్, బోయ రమేష్, షార్నప్ప భాస్కర్ రెడ్డి సీతారామ్ రెడ్డి పట్టణ మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ వీరాచారి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు

ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

**హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై 08:** సిపిఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ కడియాల వీరాచారి ఆకస్మిక మరణం ప్రజా ఉద్యమాలకు కమ్యూనిస్టు నిర్మాణానికి తీరనిలోటని ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. అనారోగ్యంతో అశువులు బాసిన సిపిఎం సీనియర్ నాయకుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అమరజీవి కడియాల వీరాచారి మృతదేహాన్ని ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ వీరాచారి మార్క్సిజాన్ని వంట పట్టించుకోని సమసమాజ స్థాపన కోసం తుది శ్వాస వరకు పనిచేశాడని ఈ క్రమంలో అనేక భూ పోరాటాలను ప్రజా ఉద్యమాలను నల్లబెల్లి మండలంలో నిర్వహించారని నీతిగా నిజాయితీగా అనేక నిర్బంధాలు వచ్చిన తట్టుకొని నిలబడ్డాడని అలాంటి కామ్రేడును కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆయన ఆశయ సాధన కోసం వర్గ సామాజిక ఐక్యత బలోపేతానికి కృషి చేయడమే వీరాచారికి ఇచ్చే ఘనమైన నివాళి అవుతుందని తెలిపారు. అంతిమయాత్రలో ఐక్య ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న పాడిన పాటలు కంటతడి పెట్టించాయి.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దామ సాంబయ్య, సహాయ కార్యదర్శి మార్త నాగరాజు సిపిఎం జిల్లా నాయకులు మండల ప్రముఖులు ప్రజలు పాల్గొన్నారు.

# గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..
రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రజా పారదర్శక పాలన.
మంత్రి జూపల్లి కృష్ణారావు..
పేదలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు పరుస్తోన్నాం .
రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి..
వనపర్తి సెగ్మేంట్ కు రెండో విడతలో 2 వేల ఇందిరమ్మ ఇళ్లు..
వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ..
రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న కాంగ్రేస్...
రాష్ట్ర స్పోర్ట్ అథారిటీ చైర్మేన్ శివసేనారెడ్డి.




వనపర్తి ప్రతినిధి జులై 8 :గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికి శాశ్వత గృహం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకు విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు . బుదవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే తూడి మేఘారట?డ్డి అధ్యక్ష తన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడికి అండగా ఉంటారని, పేదల అభ్యున్నతికి అంకిత భావంతో పాటు పడతారని రాష్ట్ర ప్రజలు నమ్మి ఈ ప్రభుత్వాన్ని బలపరిచిందని, ప్రజల నమ్మకాన్ని తల తాకట్టు పెట్టీ అయిన ఇచ్చిన మాట నిలబెట్టు కుంటామన్నారు . ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, తద్వారా పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత గృహం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూ, రాష్ట్రంలో గృహరహితులు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మూడు లక్షల 50 వేల ఇండ్లు మొత్తంగా 8 లక్షల ఇండ్లు పేదలకు కట్టిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో పేదలు ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా అత్యంత పారదర్శకంగా వారి ఖాతాలోనే డబ్బులు పడే విధంగా అమలు చేస్తున్నామని , ఇది ఎంతో గొప్ప విషయమని ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి బటన్ నొక్కితే నేరుగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడుతున్నాయని తెలిపారు. ఇంతకు ముందు ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు సైతం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు మతి భ్రమించి మాట్లాడుతున్నాయని, గత ప్రభుత్వం 8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీని గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రైతును రాజు చేయాలనే సంకల్పంతో రైతులందరికీ 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. పెట్టుబడి సాయం కింద రైతులకు ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున 9,300 కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. రైతులు పండించిన సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ కూడా అందిస్తున్నట్లు తెలియజేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఇక ఉద్యోగాల విషయానికొస్తే ఇప్పటికే 72,000 ఉద్యోగాలను భర్తీ చేశామని త్వరలోనే మరో 22 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు మేఘారెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. పేద ప్రజలకు కుటుంబ సభ్యుడిగా ఉండి అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. మేఘా రెడ్డి నాయకత్వంలో వనపర్తి నియోజకవర్గానికి కేవలం ఇందిరమ్మ ఇండ్లకే రూ.275 కోట్లు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. వనపర్తికి రెండో విడతలో భాగంగా 2000 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక, మట్టి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వీటి విషయంలో పేదలను ఇబ్బంది పెట్టకుండా ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించి లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తుల విషయంలో ప్రతి అప్లికేషన్ వెరిఫై చేసి పరిష్కరించే దిశగా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. సాదా బైనామ ఉండి పొజిషన్ లో ఉన్న రైతులకు రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**---- మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ...**

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే ఉన్న పథకాలను ఏమాత్రం తీసివేయకుండా వాటికి అదనంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు అత్యంత పారదర్శకంగా కొనసాగుతున్నాయని ప్రశంసించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వేగంగా తమ ఇండ్లను నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. అయితే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలు లబ్ధిదారులు తమకు నిర్దేశించిన పరిమితుల్లోనే ఇల్లు కట్టుకోవాలని, అప్పులు చేసి ఇండ్లు కట్టవద్దని సూచించారు. వనపర్తి నియోజకవర్గంతో పాటుగానే కొల్లాపూర్ నియోజక వర్గానికి అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పొంగులేటిని కోరారు. ప్రభుత్వంపై కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రజలు అలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. అంతేకాకుండా రూ. 8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని మంత్రి విమర్శించారు. అప్పుల భారం ఎంత ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, వేల కోట్ల రూపాయలు వెచ్చించి రైతు రుణమాఫీ చేసింద న్నారు.

**---- మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ...**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడం, వారి కలల్ని సాకారం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్థిక పరిస్థితి బాలేనప్పటికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. సుమారు రూ.60 వేల కోట్ల రూపాయలతో మిగులు బడ్జెట్ తో ఏర్పడిన రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల పాలు చేసారని విమర్శించారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గుడిసెల్లో నివసించే కుటుంబాలందరికీ శాశ్వత గృహం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.

**--- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ....**

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో వనపర్తి నియోజకవర్గంకు 2 వేల ఇండ్లు మంజూరు చేయడం ఆనందకరమని తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు గుడిసెల్లో నివసించే అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతేడాది వనపర్తి కి సీఎం వచ్చినప్పుడు వనపర్తి నియోజకవర్గలో రూ.1,000 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారని, ఇప్పటి వరకు రెండున్నర ఏళ్ళలో దాదాపు 2200 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా మరో 2000 ఇళ్లు మంజూరు చేయాలని, అదేవిధంగా జిల్లాలోని 32 ఎస్టీ హ్యాబిటేషన్లకు ప్రతి హ్యాబిటేషన్ కు 20 ఇళ్ల చొప్పున మరో 640 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వనపర్తి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయా భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెబ్బేరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ లో ఉన్న వనపర్తి బైపాస్ రహదారి నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు వనపర్తి లో ప్రెస్ క్లబ్ మంజూరు చేయాలని కోరారు. మద్రికుంటలో భూములు కోల్పోయిన రైతు లకు ఎన్ ఓ సీ ఇప్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. వనపర్తి లో క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ స్కూల్, హాకీ టర్ఫ్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టిన క్రీడల మంత్రికి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి కు ధన్యవాదములు తెలిపారు. టూరిజం శాఖ తరపున రూ. 12 కోట్లు, సంస్కృతిక శాఖ తరపున రూ. 1 కోటి వనపర్తి అభివృద్ధి కి కేటాయించినదుకు మంత్రి జూపల్లికి ధన్యవాదములు తెలిపారు.

**----- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు శాశ్వత నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. వనపర్తి నియోజకవర్గానికి మరో రెండు వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని మంత్రికి కోరారు. అనంతరం మంత్రులు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..



వనపర్తి ప్రతినిధి జులై 8: వనపర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి ద్వారా భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న మంత్రులకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రాజా గారి బంగ్లా పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పునరుద్ధరణతో పురాతన రాజ భవనా నికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు . అదేవిధంగా రూ. 2.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రేవల్లి మండల కాంప్లెక్స్ సముదాయ నిర్మాణ పనులకు సైతం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు.వనపర్తి జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రులకు అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం పూల మొక్కలు, పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీ హరి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మేన్ శివసేనారెడ్డి , వనపర్తి మున్సిపల్ ఛైర్పర్సన్ మాధవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వనపర్తి పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయం, రాజవారి ప్యాలేస్ పునరుద్ధరణ కు శంకుస్థాపన చేసిన మంత్రులు పొంగులేటి, జూపల్లి,శ్రీహరి ,ఎమ్మెల్యే మేఘారట?డ్డి శివసేనా రెడ్డిలు . .

## గురుకులాల్లో కామన్ డైట్ మెనూ తప్పనిసరి

**రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలి: జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



సిద్దిపేట, జూలై 8: జిల్లాలోని అన్ని గురుకులాల్లో కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల యాజమాన్యాలను ఆదేశించారు.బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అన్నం, వెజిటేబుల్ బిర్యానీ, ఆలుగడ్డ-టమాట కూర, ఫ్రైడ్ ఎగ్ కర్రీ, సాంబారు, పెరుగు నాణ్యతను పరిశీలించిన ఆమె, వెజిటేబుల్ బిర్యానీ నాణ్యతను ప్రశంసించారు. ప్రతిరోజూ కామన్ డైట్ మెనూను పాటిస్తూ రుచికరమైన ఆహారం అందిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల హాజరు మేరకు వంట సరుకులు, కూరగాయలను వినియోగించాలని, ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు ప్రతి భోజన ప్రక్రియను ప్రిన్సిపాల్ లేదా ఒక ఉపాధ్యాయుడు పర్యవేక్షించాలని సూచించారు.వంటగది, డైనింగ్ హాల్‌తో పాటు గురుకుల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకుని దోమలు, ఈగలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి - బిజెపి రంగారెడ్డి జిల్లా నాయకులు గుడిసె యాదయ్య.



(రాజేంద్రనగర్ )అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని బిజెపి రంగారెడ్డి జిల్లా నాయకులు గుడిసె యాదయ్య కోరారు. బుధవారం రాజేంద్రనగర్ లో బిఎల్ఓ లతో కలిసి ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్ అప్లికేషన్ ఫారంలో వివరాలు ఎలా నమోదు చేయాలి అనే అంశాలను ఓటర్లకు వివరించారు. ఓటు నమోదులో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. అర్హులైన ఓట్లను తొలగిస్తే ఏమాత్రం సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ నాయకుడు ఎస్. పెంటయ్య, బచ్చల రాజు , అనసూయ, శివ తదితరులు పాల్గొన్నారు.

## దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా.. ఆపై ఆయిల్ ఫాం సాగు

**భూమి కబ్జాతో బాటలేక పై భూములు బీడు**

**మూడేళ్లుగా రిటైర్డ్ ఉపాధ్యాయుడి పోరాటం పట్టించుకోని అధికారులు**



నారాయణపేట జూలై 8: నారాయణపేట మండలం అభాంగాపూర్ శివారులో కోటకొండకు చెందిన వ్యక్తి కరుబసప్ప ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ఆభూమిలో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నాడు. అంతే కాకుండా ఆక్రమించిన ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేయడంతో ఆపై భాగంలో ఉన్న దాదాపు 50 ఎకరాలకు పైగా బాటలేక సభ్యులు బీడుగా మారాయి.ఈ విషయాన్ని కోటకొండకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ గత మూడేళ్లుగా పోరాటం చేస్తున్న రెవిన్యూ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు.కరుబసప్ప సర్వే నెంబర్ 524 ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సర్వే లో తేలినా ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని చంద్ర శేఖర్ తెలిపారు. ఈ వ్యవహారం మొత్తం తహశీల్దార్ అవినీతి కారణంగానే జరిగిందని తెలిపారు.కాగా ఫిర్యాదు చేస్తే తననే కేసు పెడతానని తహసీల్దార్ భయపెడుతున్నారని అన్నారు.ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం సమర్పించినా న్యాయం జరుగడం లేదని అన్నారు.జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఆయిల్ ఫాం సాగు చేస్తూ ప్రభుత్వ పరంగా సబ్సిడీ పొందుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆవ్యక్తి సహకరిస్తున్న నారాయణపేట తహశీల్దార్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## హుస్నాబాద్‌లో జూలై 10న మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన

హుస్నాబాద్, జూలై 8: హుస్నాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జూలై 10న ఉదయం 11 గంటలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో మెగా జాబ్ మేళా మరియు టామ్‌కామ్ (టావీజావీ) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.తెలంగాణ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక, ఉపాధి శిక్షణ మరియు పరికముల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి సంయుక్త ఆదేశాల మేరకు ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది.ఈ జాబ్ మేళాలో సిద్దిపేట, కరీంనగర్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని వివిధ ప్రైవేట్ కంపెనీలతో పాటు టామ్‌కామ్ (టావీజావీ) ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. టెలీకాలర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫిట్టర్, డ్రైవర్లు, బైక్ రైడర్స్, నర్సులు, టైలర్లు, ఫిజియోథెరపిస్టులు, బార్బర్లు, మేస్త్రీలు, ఫార్మాసిస్టులు తదితర ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నారు.స్థానిక ఉద్యోగాలకు నెలకు రూ.12,000 నుంచి రూ.25,000 వరకు వేతనం ఉండగా, టామ్‌కామ్ ద్వారా లభించే ఉద్యోగాలకు రూ.40,000 నుంచి రూ.3 లక్షల వరకు వేతన ప్యాకేజీలు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 10న ఉదయం 11 గంటలకు హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో జరిగే మెగా జాబ్ మేళాకు హాజరు కావాలని ఉపాధి మరియు శిక్షణ శాఖ విజ్ఞప్తి చేసింది.

## ఓటర్ల ఎన్యూమరేషన్ గడువును. ఆగస్టు 30 వరకు పొడిగించాలి

ప్రజల్లో అవగాహన కల్పించాలి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . తెలంగాణలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ('సర') ప్రక్రియను మరో నెల రోజులపాటు పొడిగించాలని జిల్లా అధికారులను సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ లు కోరారు. రాష్ట్ర వ్యాపితంగా ఎన్యూమరేషన్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో తీవ్ర జాప్యం, గందరగోళం నెలకొని వున్నది. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తిస్థాయిలో గ్రామాలలో ప్రజలకు చేరలేదు అని బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన వారికి సమాచారం అంది తిరిగి సొంత గ్రామాలకు చేరుకొని ఎన్యూమ రేషన్ ఫారం లు తీసుకోవడం లో కొంచెం జాప్యం జరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గడువును ఆగస్టు 30 వరకు పెంచాలని వారు కోరారు. 30 శాతం మందికి ఎన్యూమరేషన్ ఫారాలు చేరలేదని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో ప్రజలు ఈ ప్రక్రియపై దృష్టి సారించడం కష్టంగా మారింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ పట్ల సామాన్య ప్రజల్లో సరైన అవగాహన లేదు. ఫారాలు నింపే విషయంలో ప్రజలు అనేక అనుమానాలకు, అపోహలకు లోనవుతున్నారని , ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసే విషయంలో కొంత అవగాహన లోపం కనిపిస్తుందనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు వివరాలు నమోదు చేసి బీఎల్‌వోలకు అందజేయడానికి మరింత సమయం అవసరం.ఈ నేపథ్యంలో ప్రజలంతా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ వెంటనే గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టి అపోహలను తొలగించి, 'సర' ప్రక్రియను సరళతరం చేయాలి. ఈ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఎన్యూమరేషన్ గడువును మరో నెల రోజుల పాటు, అంటే ఆగస్టు 30 వరకు పొడిగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సి ఎమ్ ఎం మండల కమిటీ సభ్యులు కుంచం శేఖర్, మల్లికంటి చంద్రశేఖర్, వింజమూరు శివ, ఖమ్మం పాటి కోటేష్, పులిజాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు

## వైఎస్సార్ 77వ జయంతి వేడుకల్లో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాసేవకు వైఎస్సార్ ఆదర్శమని ఆయనకు ఘనమైన నివాళి అర్పించారు**



దౌల్తాబాద్, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా దౌల్తాబాద్ పట్టణ కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక ప్రజాహిత పథకాలను అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.వైఎస్సార్ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్న ఆయన, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన వైఎస్సార్ సేవలను స్మరించుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్



జులై 8 మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం సీరోలు మండల కేంద్రానికి చెందిన తగరం వెంకన్న -విజయ గార్ల కుమార్తె మౌనిక వివాహం కందికొండ స్టేజి లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరుగుగా, ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన..

**మాజీ మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్**

కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు మహబూబాబాద్ మాజీ జడ్పీచైర్ పర్సన్ కుమారి ఆంగోత్ బిందు, కాంపల్లి పిఏసిఎస్ చైర్మన్ కొండపల్లి శ్రీదేవి, కురవి మండల మాజీ వైస్ ఎంపీపీలు దొంగలి నరసయ్య , పెద్ది వెంకన్న గౌడ్,సీరోల్ మండల సీనియర్ నాయకులు భోజ్యా నాయక్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్,మన్యు ప్యాట్నీ, బాణోత్ హరి నాయక్,కాంపల్లి మాజీ సర్పంచ్ తోట రమేష్, పిఏసియస్ డైరెక్టర్ కానుగంటి వెంకటరమణ,మక్కా గోపన్న,తదితరులు

## ఏఐటియుసి నల్లగొండ జిల్లా 11 మహాసభలు జయప్రదం చేయండి.

పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. . కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటాల నిర్వహించే ఏఐటియుసి నల్లగొండ జిల్లా 11 మహాసభలు ఈనెల 19వ తేదీన గుర్రంపాడ్ లో జరుగుతున్నాయనీ ఈ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా మహాసభల కరపత్రాలని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ 107 సంవత్సరాలుగా ఈ దేశంలో కార్మికుల పక్షాన పోరాడుతున్న అతిపెద్ద కార్మిక సంఘం ఏఐటియుసి అని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ కార్మికుల పొట్టగొడుతున్నారని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలు నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికులని బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కనీస వేతనాల చట్టాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీ ఆదివారం గుర్రంపాడ్ లో జరిగే ఏఐటీయూసీ నల్గొండ జిల్లా 11 మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు కేవస్ రెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాధుల లెనిన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఏం నందం, ఎండి జానీ సహాయ కార్యదర్శి,పెద్ది నాగరాజు, బాసాని వెంకటయ్య,పూల చంద్రమౌళి, సైదులు వెంకటయ్య,సత్తయ్య యాదయ్య, శంకరయ్య, నారాయణ, చందపాష, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

**రైతులకు గోదావరి నీళ్లు అందించాలి: ములకల కనకరాజు**



సిద్దిపేట జూలై 8: కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు చేయకుండా, ప్రాజెక్టులో ఏర్పడిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు గోదావరి జలాలను అందించాలని గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పిన్నింటి అబ్బిరెడ్డి, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాముని ఉమేష్ చంద్ర, కొండం రవీందర్ రెడ్డిలతో కలిసి మాట్లాడిన ఆయన, వంద పిల్లర్లలో రెండు పిల్లర్లకు మాత్రమే సమస్య ఏర్పడిందని చెప్పి మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును విఫలమైనదిగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు.కాంగ్రెస్ పార్టీ పాలనలో కరువు పరిస్థితులు ప్రజలు చూశారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో తెలంగాణ వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పు వచ్చిందని తెలిపారు.మాజీ మంత్రి హరీష్ రావు నిరంతరం శ్రమించి కాళేశ్వరం నిర్మాణాన్ని వేగవంతం చేశారని, కొండపోచమ్మ సాగర్ వరకు గోదావరి జలాలను తీసుకువచ్చి తెలంగాణను సస్యశ్యామలం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ప్రస్తుతం రెండు పిల్లర్ల వద్ద ఏర్పడిన సమస్యను సాంకేతికంగా పరిష్కరించే అవకాశం ఉందని, అక్కడ కాఫర్ డ్యాం నిర్మించి గోదావరి జలాలను రైతులకు అందించే చర్యలను ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా కాళేశ్వరం ద్వారా సాగునీటిని అందించి రాష్ట్రాన్ని కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పిన్నింటి అబ్బిరెడ్డి, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాముని ఉమేష్ చంద్ర, కొండం రవీందర్ రెడ్డి, మిట్టపల్లి సుధాకర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్





మహబూబాబాద్ జిల్లా కురవి-- కాంపెల్లి రహదారిలో స్కూల్ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు మరియు బాధితులను ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు జాటోత్ రాంచంద్రు నాయక్ పరామర్శించారు.బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, వారికి ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.అదేవిధంగా, ఈ ప్రమాదంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## డి.డి.ఎన్.ఎస్. అర్చకులపై చేసిన అసత్య వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి: జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూలై 8: వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ దూపదీప నైవేద్య సేవలో ఉన్న అర్చకులపై చేసిన వ్యాఖ్యలను జిల్లా దూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దూపదీప నైవేద్య అర్చకులు నిత్యం ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో సేవలందిస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నారని అన్నారు. అలాంటి అర్చకుల గౌరవాన్ని దెబ్బతీసేలా, కక్షపూరిత ధోరణితో అసత్య ఆరోపణలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు.అర్చకుల సంక్షేమం కోసం వ్యక్తిగతంగా ఎలాంటి సహాయం చేయకుండా, వారి సేవలను గుర్తించకుండా అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ప్రజల ముందు అర్చకుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడడం తగదని, బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.గంగు ఉపేంద్ర శర్మ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, దూపదీప నైవేద్య అర్చకులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని చక్రవర్తి చార్యులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దూపదీప నైవేద్య అర్చకులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసన కార్యక్రమాలను చేపడతారని హెచ్చరించారు.అర్చకుల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం కొనసాగాలని, వ్యక్తిగత విభేదాలను సంఘాలపైకి తీసుకురాకుండా బాధ్యతతో వ్యవహరించాలని ఆయన కోరారు. అర్చకుల గౌరవాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చక్రవర్తి చార్యులు పిలుపునిచ్చారు.

## బహుళ అష్టమికీ శ్రీ గుంటిరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు ఆచార్య



ఐజ, శివసూర్య జూలై 8 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ఠ మాసం బహుళ అష్టమి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ ఆంజనేయులు వీరేష్ పాండు అమర్ సరస్వతి చిన్నఆంజనేయులు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితునికి 30000 వేలు ఆర్థిక సాయం



మచిలీపట్నం : పెడన మండలం ఆచయ్యవారి పాలెం గ్రామం కృష్ణజిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, కానూరు హై స్కూల్,స్కూల్ అభివృద్ధి చైర్మన్ గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో పిప్పళ్ల మౌనిక కుమారుడు పిప్పళ్ళ శివ కార్తిక్ కు 30,000/- వేల రూపాయలను అందచేశారు.పిప్పళ్ల శివ కార్తిక్ వయస్సు 6 సంవత్సరాలు. ఈ విద్యార్థి గత కొంతకాలంగా క్యాన్సర్ అనే వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ బాధను చూసి చలించిన పదవ తరగతి 2016 బ్యాచ్ కి చెందిన 20 మంది విద్యార్థులు 20,000/- వేల రూపాయలు,గోపు సత్యనారాయణ 10,000/- వేల రూపాయలు అందరూ కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం 30,000/వేల రూపాయలు అందచేశారు. క్యాన్సర్ లాంటి వ్యాధితో బాధ పడుతున్న కుటుంబానికి మేము అండగా ఉంటామని పదవ తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వపు విద్యార్థులు తెలిపారు,ఈ కార్యక్రమంలో బొలిశెట్టి నాని, వీర చిన్న, గమ్మిడి శ్రీనివాసరావు, మరుబోయిన శంకర్, మరుబోయిన శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి కొండ, పదవ తరగతి 2016బ్యాచ్ విద్యార్థులు, హై స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న బాలాజీ హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి...ఏఐఎస్ఎఫ్



మచిలీపట్నం : మచిలీపట్నంలోని ఇంగ్లీష్ మీడియం బాలాజీ హైస్కూల్ యాజమాన్యం విద్యార్థుల నుంచి విద్య పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు విక్రయిస్తూ వ్యాపారం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ ఆరోపించారు.అధిక ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, డ్రెస్సుల ఖర్చులు భరించలేకపోతున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ సమస్యలను ఏఐఎస్ఎఫ్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాలను సందర్శించి యాజమాన్యాన్ని ప్రశ్నించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, పుస్తకాలు, బ్యాగులు, డ్రెస్సుల విక్రయాలకు బాలాజీ హైస్కూల్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆమె తెలిపినట్లు సాయికుమార్ పేర్కొన్నారు. అయితే "శ్రీ బాలాజీ స్కూల్" పేరుతో





బిల్లులు ఉన్న విషయాన్ని చూపించి ప్రశ్నించగా, అందుకు ఆమె సరైన సమాధానం ఇవ్వలేకపోయారని ఆరోపించారు.ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఫిర్యాదు చేసినట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నున్న అరవింద్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరంలో ఘనంగా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి....వల్లభనేని వంశీ మోహన్.



గన్నవరం, : గన్నవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభనేని వంశీ మోహన్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు కేక్, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వల్లభనేని వంశీ మోహన్ మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రజాసేవ, సంక్షేమ పాలనను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో సమిష్టిగా పనిచేసి, 2029 ఎన్నికల్లో ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు అనగాని రవి, సీనియర్ నాయకుడు తోట వెంకయ్య, మైనార్టీ నాయకుడు ఎండి గౌసాని, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజిబెత్ రాణి, కోడిబోయిన బాబి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట



పెడన,: మండలం పరిధిలోగల సింగరాయపాలెం గ్రామంలో నూతన శ్రీ శ్రీ శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమశీ అంగరంగ వైభవంగా నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిష్టా కార్యక్రమాలను తిలకించి పాల్గొన్నారు. ఈసందర్భంగా తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజా కార్యక్రమలు హోమాలు అన్న సమారాధన నిర్వహించారు. మహిళలు పిల్లలు పెద్దలు వందలాది సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకునే తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో శలపాటి ప్రసాద్ భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మిల్క్ సొసైటీ నూతన అధ్యక్షులూగా దండమూడి శివ నాగేశ్వరరావు



కృష్ణాజిల్లా : ఘంటసాల మండలం తాడేపల్లిమిల్క్ సొసైటీ అధ్యక్షునిగా దండుమూడి శివనాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గురువారం ఉదయం మిల్క్ సొసైటీలోపాలకవర్గ సభ్యులతో ప్రమా ణస్వీకారంచేసి బాధ్యతలు చేపట్టినట్లు సొసైటీ అధ్యక్షులు శివ నాగేశ్వరరావు తెలిపారు.మిల్క్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని రైతులకు అందుబాటులో ఉండి అండగా ఉంటానని తెలియజేశారు-పాల ఉత్పత్తిని పెంచేందుకు రైతు సోదరులంతా సహకరించి సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.ప్రభుత్వం అందించే సబ్సిడీలు రైతులకు మరింతగా ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే పాలు ఉత్పత్తి చేసే రైతులకు పశువుల దానా.మినరల్ మిక్చర్.ప్రత్యేకంగాగ్రామంలో ఏదైనా ఫంక్షన్ల సమయంలో నెయ్యి.పన్నీరు.పెరుగు వంటివి సొసైటీ ద్వారా రైతులకు అందించడం వంటి కార్యక్రమాలతో పాటు.రైతన్నల కోసం పశువుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం చేబడతామని రైతులకు విజ్ఞప్తి చేశారు.కొల్లూరి కృష్ణ.వెంకటేశ్వరావు.మండే భాస్కరరావు.పెనుముడు సుబ్బారావు.కొండేటి అంజయ్య.దోనేపూడి కోటేశ్వరావులు పాల్గొన్నారు అలాగే గ్రామంలోని మరి కొంత మంది పెద్దలు కూడా హాజరయ్యే శుభాకాంక్షలు తెలియజేశారు

# పేదలకు సరళీకృత పరిపాలన, రెవెన్యూ సంస్కరణలే ప్రభుత్వ లక్ష్యం

ఉయ్యూరులో నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, పెనమలూరు శాసనసభ్యుడు బోడె ప్రసాద్ తదితరులతో కలిసి ప్రారంభోత్సవం చేసిన మంత్రి



ఉయ్యూరు : రాష్ట్రంలో పేదలకు హక్కులు కల్పిస్తూ, పారదర్శకమైన, సరళీకృతమైన రెవెన్యూ పరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మండలంలో నూతనంగా నిర్మించిన ఉయ్యూరు తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడె ప్రసాద్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉయ్యూరులో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఐసీడీఎస్



కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా సమగ్ర పరిపాలనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన 2014-19లోనే రూపుదిద్దుకుందని మంత్రి తెలిపారు. ప్రజలకు ఒకేచోట అన్ని ప్రభుత్వ సేవలు అందేలా రూపొందించిన ఈ ప్రణాళికను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకువచ్చారని చెప్పారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిలిపివేయగా, 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవతో, దాతల సహకారంతో ఈ భవనం పూర్తై ప్రజలకు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన వినతులను స్వీకరించి, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా రెవెన్యూ వ్యవహారాలపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ సుపరిపాలనకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతుల ఈ-కేవైసీ, వారి అంగీకారం అనంతరం మాత్రమే పాస్‌బుక్‌లు ముద్రించి అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి నెల ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని, సరిదిద్దిన భూ రికార్డులు, పాస్‌బుక్‌లను స్వయంగా అందజేస్తున్నారని పేర్కొన్నారు.పేదలు అనుభవిస్తున్న భూ సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కుటుంబ వివాదాలు మినహా ప్రభుత్వ పరిధిలో పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.రీ-సర్వేను పకడ్బందీగా అమలు చేస్తూనే, 22-ఏ నిబంధనలను కూడా సరళీకృతం చేస్తున్నామని తెలిపారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూములు తప్ప సాధారణ ప్రైవేటు ఆస్తులను 22-ఏలో చేర్చవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. భూమిని 22-ఏలో చేర్చే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వడం తప్పనిసరి చేశామని చెప్పారు.రెవెన్యూ, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో చారిత్రక సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు స్లాట్ బుకింగ్, సేవా కేంద్రాలు, ఆటోమేషన్ వంటి ఆధునిక విధానాలను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇవన్నీ సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు.రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న మంత్రి, అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు విశాఖపట్నాన్ని ఐటీ, ఏరోస్పేస్ కేంద్రంగా, ఇతర ప్రాంతాలను ప్రత్యేక రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీ అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.23 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని, ప్రపంచ స్థాయి సంస్థలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ఆధునిక మౌలిక వసతులతో రెవెన్యూ కార్యాలయాల అభివృద్ధి ---- జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ డీకే బాలాజి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ప్రజలతో అత్యంత ప్రత్యక్ష సంబంధం కలిగిన శాఖ రెవెన్యూ శాఖ అని, ప్రతి రోజు అనేక మంది ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తారని అన్నారు.

కార్యాలయానికి వచ్చే ప్రతి పౌరుడికి తన సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కలిగేలా ఆధునిక మౌలిక వసతులు, ప్రజలకు అనుకూలమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లక్ష్యంతో ఉయ్యూరులో నూతన తహసిల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం కావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్వచ్ఛందంగా భూమిని అందించిన మాజీ ప్రజాప్రతినిధి సజ్జా వెంకటేశ్వరరావుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం తరఫున, ఉయ్యూరు మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల కోసం భూమి సమీకరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయని, అయితే ఉయ్యూరులో మాత్రం స్వయంగా ముందుకు వచ్చి భూమిని అందించడం గొప్ప ప్రజాసేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం మాత్రమే కాకుండా దాతలు కూడా సహకరించడం అభినందనీయమని పేర్కొంటూ, సహకరించిన ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. శంకుస్థాపన చేసిన భవనాన్నే ప్రారంభించే అవకాశం దక్కడం అదృష్టం -- ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఈ భవనానికి శంకుస్థాపన చేసిన తమ చేతుల మీదగానే ప్రారంభోత్సవం జరగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

2014--19 కాలంలో ఉయ్యూరులో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటుకు ఈ స్థలాన్ని కేటాయించినప్పుడు కొందరు వ్యతిరేకించినప్పటికీ, రూరల్, అర్బన్ ప్రాంతాలకు సమానంగా అందుబాటులో ఉండే కేంద్ర ప్రాంతంగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ భూమిని ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలనే ఉద్దేశంతో పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు.పెనమలూరు నియోజకవర్గంలో ఎనమలకుదురు




వంతెన, సిద్ధార్థ కళాశాల ఫ్లైఓవర్, మద్దూరు--ఉప్పలూరు రహదారి, కుందేరు వంతెన వంటి కీలక అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటీవల గన్నవరం ప్రాంతంలో పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభించినట్లు గుర్తు చేస్తూ, ఉయ్యూరులో కూడా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం దశలవారీగా పూర్తవుతోందన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డిఓ ఎస్ కరుణ కుమారి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఉయ్యూరు మండలం తహసిల్దార్ సురేష్, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకం లబ్ధి పొందాలంటే విద్యార్థులు వెంటనే బ్యాంకు ఖాతా ప్రారంభించాలి

ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ పూర్తి చేసుకోవాలి.

పెండింగ్ ప్రక్రియలను త్వరగా పూర్తి చేయండి .... సహాయ సంచాలకులు షేక్ షాహిద్ బాబు



మచిలీపట్నం, : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సహాయ సంచాలకులు, సాంఘిక సంక్షేమ శాఖ, షేక్ షాహిద్ బాబు తెలిపారు. తల్లికి వందనం పథకం లబ్ధి పొందేందుకు అర్హులైన ఇంటర్మీడియట్ ఎస్సీ విద్యార్థులు వెంటనే తమ పేరిట బ్యాంకు ఖాతా ప్రారంభించుకోవడంతో పాటు, ఇప్పటికే బ్యాంకు ఖాతా కలిగిన విద్యార్థులు ఆధార్ సీడింగ్, ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ ప్రక్రియలను ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయిన విద్యార్థులకే ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. జిల్లాలో పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. 02-07-2026 నాటికి 4,230 పెండింగ్ కేసులు ఉండగా, క్షేత్రస్థాయిలో చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా 06-07-2026 నాటికి వాటిని 1,477కు తగ్గించడం జరిగిందని తెలిపారు.

ప్రస్తుతం డివిజన్ వారీగా పెండింగ్ కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి:

మచిలీపట్నం -- 249
గన్నవరం -- 289
గుడివాడ -- 386
అవనిగడ్డ -- 122
ఉయ్యూరు -- 431

జిల్లాలోని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులు వార్డెన్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు కళాశాలల యాజమాన్యాలు పరస్పర సమన్వయంతో ప్రతి అర్హత కల్గిన విద్యార్థిని వ్యక్తిగతంగా సంప్రదించి, బ్యాంకు ఖాతా ప్రారంభించడం, ఆధార్ సీడింగ్, ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ తదితర పెండింగ్ ప్రక్రియలను అత్యవసరంగా పూర్తి చేయించి, "తల్లికి వందనం" పథకం ప్రతి అర్హత కల్గిన విద్యార్థికి అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థులందరూ ఆలస్యం చేయకుండా తమ బ్యాంకు ఖాతా, ఆధార్ సీడింగ్, ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ వివరాలను వెంటనే పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న "తల్లికి వందనం" పథకం ప్రయోజనాన్ని పొందాలని సహాయ సంచాలకులు, కృష్ణాజిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, షేక్ షాహిద్ బాబు తెలిపారు.

## వైఎస్సార్ కు మరణం లేదు: షర్మిల

తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన షర్మిల

వైఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రశంస

ఆయన మరణం తట్టుకోలేక 700 మంది ఆయనతో పాటే వెళ్లిపోయారని వ్యాఖ్య




అమరావతి: తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు' అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు మాత్రమే పని చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

## రామవరప్పాడులో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

కృష్ణాజిల్లా : కృష్ణా జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో



భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి బుధవారం గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి, డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల వివరాలను నమోదు చేసే సమయంలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట గన్నవరం నియోజకవర్గ ఈఆర్వో సమగ్ర శిక్ష ఏపీసి ఆర్ కుముదిని సింగ్, డిఆర్డిఎ పిడి హరిహరనాథ్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రూ.10 నాణేలతో రూ.1 లక్షా10 బైక్
# కొనుగోలు చేసిన యువకుడు



యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. తాను కొనుగోలు చేసిన నూతన ద్విచక్ర వాహనానికి సంబంధించిన పూర్తి నగదును ఓ వ్యక్తి పది రూపాయల నాణేల రూపంలో చెల్లించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చిట్యాల మండల కేంద్రంలో ఈ వినూత్న ఘటన వెలుగుచూసింది. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండ రఘుపతి అనే వ్యక్తి, స్థానిక శ్రీ వినాయక మోటార్స్ షోరూమ్‌లో హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను కొనుగోలు చేశాడు. వాహనం ధర సుమారు రూ.1.10 లక్షలు కాగా, ఈ మొత్తాన్ని నోట్ల రూపంలో కాకుండా పూర్తిగా పది రూపాయల నాణేల రూపంలోనే చెల్లించాడు. ఇందుకోసం తాను సుదీర్ఘకాలంగా పొదుపు చేసిన నాణేలను బస్తాల్లో నింపి షోరూమ్‌కు తీసుకువచ్చాడు. రఘుపతి తీసుకువచ్చిన నాణేల బస్తాలను చూసి షోరూమ్ సిబ్బంది తొలుత ఆశ్చర్యానికి గురైనప్పటికీ, అనంతరం ఎంతో ఓపికతో వాటిని లెక్కించారు. నగదు మొత్తాన్ని సరిచూసుకున్న తర్వాత సదరు వాహనాన్ని అతనికి అందజేశారు. పది రూపాయల నాణేలు చట్టబద్ధంగా చెల్లుబాటులో ఉండటంతో ఈ లావాదేవీకి ఎటువంటి ఆటంకాలు ఎదురుకాలేదు. ఈ అరుదైన దృశ్యాలను అక్కడున్న వారు తమ మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఎంతో పట్టుదలతో నగదును పొదుపు చేసి తన కలను నెరవేర్చుకున్న రఘుపతిని, అందుకు సహకరించిన షోరూమ్ సిబ్బందిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## భారత్‌లో పదేళ్లలో మూడింతలు
# పెరిగిన క్రెడిట్ కార్డు మార్కెట్

5.2 కోట్లకు చేరిన కార్డు హోల్డర్ల సంఖ్య

యువత, గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న వినియోగం

రూ.3.1 లక్షల కోట్లకు పెరిగిన కార్డు బకాయిలు

భారత్‌లో ఇంకా 25% మందికే క్రెడిట్ కార్డులు

క్రెడిట్ కార్డుల విస్తరణకు భారీ అవకాశాలు



దేశంలో గత పదేళ్లలో క్రెడిట్ కార్డుల వినియోగం మూడు రెట్లకు పైగా పెరిగిందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ నివేదిక వెల్లడించింది. కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకుంటున్న వారిలో యువతతో పాటు సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల వినియోగదారుల సంఖ్య కూడా పెరుగుతోందని తెలిపింది. అయినప్పటికీ దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం ఇంకా తక్కువగానే ఉందని అభిప్రాయపడింది. ఈ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. 2016 మార్చిలో 1.4 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డు హోల్డర్ల సంఖ్య 2026 మార్చి నాటికి 5.2 కోట్లకు చేరింది. ఇదే కాలంలో యాక్టివ్ క్రెడిట్ కార్డులు 2.1 కోట్ల నుంచి 10.7 కోట్లకు పెరిగాయి. క్రెడిట్ కార్డులపై బకాయిలు రూ.0.4 లక్షల కోట్ల నుంచి రూ.3.1 లక్షల కోట్లకు పెరిగాయి. కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకున్న వారిలో 30 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయసున్నవారి వాటా 2022లో 43 శాతం ఉండగా 2026 నాటికి 50 శాతానికి చేరింది. అలాగే సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల నుంచి కార్డులు తీసుకున్న వారి వాటా 42 శాతం నుంచి 46 శాతానికి పెరిగింది. అంతేకాదు తొలి క్రెడిట్ కార్డు తీసుకునే వారిలో 25 శాతం మందికి ఇప్పటికే మూడు లేదా అంతకంటే ఎక్కువ లోన్ అకౌంట్లు ఉన్నాయని నివేదిక వెల్లడించింది. చిన్న మొత్తాల వ్యక్తిగత రుణాలు, వినియోగ వస్తువుల రుణాలతో పాటు క్రెడిట్ కార్డులను కూడా వినియోగిస్తున్నారని పేర్కొంది. అయితే భారత్‌లో క్రెడిట్ యాక్టివ్ వినియోగదారుల్లో కేవలం 25 శాతం మందికే క్రెడిట్ కార్డులు ఉన్నాయని నివేదిక తెలిపింది. ఇది బ్రిటన్ (70%), కొలంబియా (62%), హాంకాంగ్ (98%)తో పోలిస్తే చాలా తక్కువ. దీంతో దేశంలో క్రెడిట్ కార్డుల విస్తరణకు ఇంకా భారీ అవకాశాలు ఉన్నాయని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ పేర్కొంది.

## సముద్రంపై ఎక్కడా ఆగకుండా 11 రోజులు..
# ఓ పక్షి అద్భుత ప్రయాణం

బార్-టెయిల్డ్ గాడ్విట్ పక్షి అసాధారణ ప్రయాణ సామర్థ్యం

ఆగకుండా 11 రోజుల్లో 13,560 కిలోమీటర్లు ప్రయాణించి రికార్డు

అలస్కా నుంచి టాస్మానియాకు ఆహారం, నీరు లేకుండా యాత్ర

ప్రయాణానికి ముందు రెట్టింపు బరువు పెరిగి సిద్ధమవడం




ప్రకృతిలో కొన్ని జీవుల పట్టుదల, సామర్థ్యాలు విస్మయానికి గురిచేస్తుంటాయి. అటువంటి వింతలో 'బార్-టెయిల్డ్ గాడ్విట్' అనే పక్షి సాగించే సాహసోపేత యాత్ర అద్వితీయమైంది. ఆహారం, నీరు, కనీసం విశ్రాంతి కూడా లేకుండా ఏకధాటిగా 11 రోజుల పాటు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రాన్ని దాటగల దీని సామర్థ్యం శాస్త్రవేత్తలనే విస్తుపోయేలా చేస్తోంది. 2022లో ఒక యువ గాడ్విట్ పక్షి అలస్కా నుంచి ఆస్ట్రేలియాలోని టాస్మానియాకు నిరంతరాయంగా ప్రయాణించి కొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 11 రోజుల ఒక గంట వ్యవధిలో దాదాపు 13,560 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఒక పక్షి ఎక్కడా ఆగకుండా ఇంత సుదీర్ఘ దూరం ప్రయాణించడం ఇదే ప్రథమం. సాధారణంగా ఆర్కిటిక్ ప్రాంతంలో నివసించే ఈ పక్షులు, శీతాకాలం ప్రారంభంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి ప్రాంతాలకు వలస వెళుతుంటాయి. ఈ అసాధారణ ప్రయాణం వెనుక ఆశ్చర్యకరమైన శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. వలస ప్రయాణానికి సిద్ధమయ్యే ముందు ఈ పక్షులు విపరీతంగా ఆహారం తీసుకుని, తమ శరీర బరువును దాదాపు రెట్టింపు చేసుకుంటాయి. ప్రయాణ సమయంలో బరువును సమతుల్యం చేసుకునేందుకు, తమ జీర్ణవ్యవస్థలోని కొన్ని అవయవాలను తాత్కాలికంగా కుదించుకుంటాయి. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును శక్తిగా మార్చుకుంటూ వేల కిలోమీటర్ల దూరాన్ని ఇవి అధిగమిస్తాయి. మార్గమధ్యలో ఎలాంటి భూభాగం లేని విశాల సముద్రంపై ప్రయాణిస్తున్నప్పుడు, ఇవి నక్షత్రాలు మరియు భూమి యొక్క అయస్కాంత క్షేత్రాల ఆధారంగా దిశను గుర్తించగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయాణ సమయంలోనే మెదడులోని ఒక భాగానికి విశ్రాంతినిస్తూ, మరో భాగంతో అప్రమత్తంగా ఉంటూ తమ నిద్ర అవసరాలను తీర్చుకుంటాయని భావిస్తున్నారు. ఈ పక్షుల యాత్రలు జీవ పరిణామం, శక్తి వినియోగం వంటి అంశాలపై మరిన్ని నూతన పరిశోధనలకు స్ఫూర్తినిస్తున్నాయి.

# అమెరికాలో భారత గ్యాంగ్‌ల అరాచకాలు..
# ప్రవాసులే లక్ష్యంగా హత్యలు, బెదిరింపు వసూళ్లు

ఉత్తర అమెరికాలోని ప్రవాస భారతీయులే లక్ష్యంగా భారత గ్యాంగ్‌ల నేరాలు

లారెన్స్ బిష్ణోయ్ ముఠా సహా 37 మందిపై అమెరికాలో ఫెడరల్ అభియోగాలు

ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్, గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యల్లో ఈ గ్యాంగ్‌ల ప్రమేయం

నటుడు సల్మాన్ ఖాన్‌ను చంపేస్తామని బిష్ణోయ్ పదేపదే బెదిరింపులు

భారత్‌లోని అవినీతి పోలీసులతో కుమ్మక్కై తప్పుడు కేసులు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్న మరో ముఠా



ఢిల్లీ: ఉత్తర అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులను లక్ష్యంగా చేసుకుని, భారతదేశానికి చెందిన వ్యవస్థీకృత నేర ముఠాలు దాడులకు పాల్పడుతున్నాయని అమెరికా న్యాయ విభాగం వెల్లడించింది. హత్యలు, బెదిరింపు వసూళ్లు, కిడ్నాపుల ద్వారా భయానక వాతావరణాన్ని సృష్టించి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాయని తెలిపింది. 'ఆపరేషన్ హార్డ్ బాల్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో భాగంగా మూడు అంతర్జాతీయ నేర సంస్థలతో సంబంధం ఉన్న 37 మందిపై ఫెడరల్ అభియోగాలను నమోదు చేసినట్లు ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 24 మందిని అరెస్ట్ చేశారు. ఈ నేర ముఠాలు అమెరికా, కెనడా, ఐరోపా దేశాల్లో హత్యలు, కిడ్నాపులు, బెదిరింపు వసూళ్లు, ఆయుధాల అక్రమ రవాణా, భారీ స్థాయిలో డ్రగ్స్ సరఫరా వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు లాస్ ఏంజిల్స్‌లో యూఎస్ ఫస్ట్ అసిస్టెంట్ అటార్నీ బిలాల్ ఎ. ఎస్సాయిలీ తెలిపారు. "ఈ ముఠాలు ముఖ్యంగా భారత్‌తో సంబంధాలున్న వారిని లక్ష్యంగా చేసుకున్నాయి. బాధితులకు, భారత్‌లోని వారి కుటుంబ సభ్యులకు ప్రాణహాని తలపెడతామని బెదిరించి డబ్బు వసూలు చేశాయి" అని ఆయన వివరించారు. అభియోగాల ప్రకారం లారెన్స్ బిష్ణోయ్ నేర ముఠా హింసను ఒక ఆయుధంగా వాడుకుంది. ముఖ్యంగా భారత్‌లో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయ వర్గాల్లో భయాన్ని సృష్టించి, ఆ తర్వాత బాధితుల నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేసింది. తాము చేసిన హింసాత్మక చర్యలను ఆన్‌లైన్ వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, మీడియా ఇంటర్వ్యూల ద్వారా ప్రచారం చేసుకుని తమ పలుకుబడిని పెంచుకున్నట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. భారత్‌లో, విదేశాల్లో ఉన్న ప్రముఖ సాంస్కృతిక, రాజకీయ, వ్యాపార నాయకులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా తమ గ్యాంగ్‌కు విపరీతమైన ప్రచారం కల్పించుకుని, భవిష్యత్తులో బెదిరింపు వసూళ్లకు మార్గం సుగమం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ అభియోగాల్లో పలు సంచలన విషయాలు ఉన్నాయి. 2023 జూన్ 18న కెనడాలోని సర్రేలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ (కోర్టు పత్రాల్లో 'ఎ.నా.చీ.'గా పేర్కొన్నారు) హత్య వెనుక బిష్ణోయ్, అతని ఉత్తర అమెరికా నాయకుడు సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ ఉన్నారని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అలాగే, 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకు కూడా ఈ గ్యాంగే బాధ్యత వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ను చంపాలనే తమ ఉద్దేశాన్ని బిష్ణోయ్ 2022 నుంచి 2026 మధ్య అనేకసార్లు బహిరంగంగా ప్రకటించాడని, ఈ దాడులు, బెదిరింపుల ద్వారా ప్రజల్లో భయాన్ని వ్యాపింపజేయడమే వారి లక్ష్యమని అభియోగాల్లో పేర్కొన్నారు. మరోవైపు జగ్గూ భగవాన్‌పురియా నేర ముఠా కూడా ప్రవాస భారతీయులను లక్ష్యంగా చేసుకుందని, కొన్ని సందర్భాల్లో భారత్‌లోని కొందరు అవినీతి పోలీసు అధికారులతో కుమ్మక్కై బాధితులపై తప్పుడు కేసులు బనాయించి, వాటిని ఉపసంహరించుకోవాలంటే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేసేదని మరో అభియోగపత్రంలో వెల్లడించారు. ఈ భారీ దర్యాప్తులో అమెరికా, కెనడా, ఐరోపా, ఆసియా దేశాల చట్ట అమలు సంస్థలు పాలుపంచుకున్నాయని యూఎస్ న్యాయ విభాగం స్పష్టం చేసింది.

# వర్షాకాలంలో వేడివేడి పకోడీ, బజ్జీ తినాలని ఎందుకు అనిపిస్తుంది?..

వర్షాకాలంలో స్నాక్స్‌పై కోరికలకు శారీరక అవసరం కన్నా మానసిక కారణాలే ఎక్కువ

చిన్ననాటి జ్ఞాపకాలు మెదడును ప్రభావితం చేసి ప్రత్యేక ఆహారాలపైకి మనసు మళ్లిస్తాయని వెల్లడి

నిజంగా ఆకలిగా ఉందా? లేక సౌకర్యం కోరుకుంటున్నారా? అని ప్రశ్నించుకోవాలని నిపుణుల సూచన

వేయించిన స్నాక్స్‌కు బదులు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు ఎంచుకోవడం మేలు

ఈ సీజన్‌లో ఆహార పరిశుభ్రత చాలా ముఖ్యం.. ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం ఎక్కువ



భగభగమండే వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగిస్తూ వర్షాకాలం రానే వస్తుంది. చల్లటి వాతావరణం, పచ్చని ప్రకృతి, చిటపట కురిసే వాన చప్పుడు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి. అయితే, వాన పడగానే చాలామందికి వేడివేడి టీ, కరకరలాడే పకోడీలు, కాల్చిన మొక్కజొన్న, మసాలా మ్యాగీ, సమోసాల వంటివి తినాలనే కోరిక బలంగా కలుగుతుంది. సోషల్ మీడియా అంతా వర్షం, స్నాక్స్ ఫొటోలతో నిండిపోతుంది. అయితే, వర్షాకాలంలో ఇలాంటి ఆహార పదార్థాలు తినాలనే కోరిక ఎందుకు కలుగుతుంది? వాతావరణం మారగానే శరీరానికి నిజంగానే వేయించిన, తీపి పదార్థాల అవసరం పెరుగుతుందా? అంటే, అది కేవలం మన ఆలోచనా విధానం, జ్ఞాపకాల వల్లే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది శారీరక అవసరం కన్నా ఎక్కువగా మానసికమైనదని వివరిస్తున్నారు.

ఆకలి కాదు... జ్ఞాపకాల ప్రభావం!

తొలకరి జల్లు పడగానే చాలామందికి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. కిటికీ పక్కన కూర్చుని కుటుంబంతో కలిసి వేడివేడి పకోడీలు, ఇంట్లో చేసిన స్నాక్స్ తిన్న అనుభూతులు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. మట్టి వాసన, చల్లటి గాలులు, నల్లటి మబ్బులు ఒక రకమైన సౌకర్యవంతమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఇలాంటి అనుభవాలు పదేపదే పునరావృతం కావడం వల్ల, వర్షం పడినప్పుడల్లా మెదడు ఆ ఆహార పదార్థాలను గుర్తుచేస్తుంది. దీనివల్ల వాటిని తినాలనే కోరిక బలంగా కలుగుతుంది. ఇది నిజమైన ఆకలి కాదని, కేవలం భావోద్వేగ, ఇంద్రియ ప్రతిస్పందన అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

సౌకర్యవంతమైన ఆహారం ఎందుకు సంతృప్తినిస్తుంది?

మనం ఇష్టపడే కంఫర్ట్ ఫుడ్స్‌లో సాధారణంగా కార్బోహైడ్రేట్లు, ఉప్పు, కొవ్వు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఆహారానికి మంచి రుచిని అందించి, తక్షణ సంతృప్తిని కలిగిస్తాయి. చల్లటి వాతావరణంలో వేడివేడి పదార్థాలు తినడం వల్ల శరీరానికి వెచ్చదనం లభించి, మానసికంగా హాయిగా అనిపిస్తుంది. దీనికి తోడు, వర్షాకాలంలో బయటకు వెళ్లే అవకాశాలు తగ్గి, ఎక్కువ సమయం ఇంట్లోనే ఉంటారు. పని ఒత్తిడి, విసుగు, బోర్ కొట్టడం వంటి కారణాల వల్ల కూడా నిజమైన ఆకలి లేకపోయినా ఏదో ఒకటి తినాలనిపిస్తుంది.

ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు

అయితే, వర్షాకాలంలో ఇష్టమైన స్నాక్స్ పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు. రోజంతా వేయించిన పదార్థాలు తినే బదులు, వాటిని మితంగా తీసుకోవడం మంచిది. వీటికి బదులుగా ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆరోగ్యకరమైన స్నాక్స్ ఎంచుకోవచ్చు. వేయించిన శనగలు, వేయించిన మఖానా (తామర గింజలు), మొక్కజొన్న చాట్, మొలకల చాట్, ఢోక్లా, బేసన్ చిల్లా వంటివి మంచి ప్రత్యామ్నాయాలు. పకోడీలు తినాలనిపిస్తే, బయట కొనే బదులు ఇంట్లోనే కూరగాయలతో తయారుచేసుకోవడం ఉత్తమం. నూనె తక్కువగా వాడటానికి ఎయిర్-ఫ్రైయింగ్ లేదా బేకింగ్ పద్ధతులను ప్రయత్నించవచ్చు.

ఆహార పరిశుభ్రత చాలా ముఖ్యం

వర్షాకాలంలో ఆహార కోరికలతో పాటు ఆహార పరిశుభ్రతపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వాతావరణంలోని అధిక తేమ కారణంగా బ్యాక్టీరియా, ఇతర క్రిములు వేగంగా వృద్ధి చెందుతాయి. దీనివల్ల ఫుడ్ పాయిజనింగ్, కడుపు ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. వీలైనంత వరకు వేడిగా, తాజాగా వండిన ఆహారాన్నే తినాలి. బయట కట్ చేసి ఉంచిన పండ్లు, పాలు, మాంసం, మిగిలిపోయిన ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. డయాబెటిస్, అధిక రక్తపోటు, జీర్ణ సమస్యలు ఉన్నవారు వేయించిన, ఉప్పు, తీపి ఎక్కువగా ఉండే పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. మొత్తం మీద వర్షాకాలం అంటే కేవలం ఆహారం మాత్రమే కాదు. ఆకలికి, కోరికకు మధ్య తేడాను గ్రహించి, మితంగా తింటూ, పరిశుభ్రత పాటిస్తే ఈ సీజన్‌ను ఆరోగ్యంగా, ఆనందంగా ఆస్వాదించవచ్చు.

# ఇండో-పసిఫిక్‌లో చైనా ముందడుగు

## 40 ఏళ్ల తర్వాత జలాంతర్గామి న్యూక్లియర్ మిసైల్ పరీక్షతో

1982 తర్వాత చైనా మొదటి బహిరంగ జలాంతర్గామి ఆధారిత బాలిస్టిక్ క్షిపణి పరీక్ష

పసిఫిక్ మహాసముద్రంలోకి అణు జలంతర్గామి ద్వారా క్షిపణి ప్రయోగం

10,000 కిలోమీటర్లకు పైగా పరిధి గల 'జీ-3' క్షిపణిగా రక్షణ రంగ నిపుణుల అంచనా

అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల తీవ్ర ఆందోళన

భూమి, ఆకాశం, సముద్ర మార్గాల 'న్యూక్లియర్ ట్రైయాడ్' పూర్తి చేసిన చైనా



ఢిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన సైనిక ఆధిపత్యాన్ని చాటుకునేలా చైనా అత్యంత కీలకమైన అణు సామర్థ్య పరీక్ష నిర్వహించింది. గత నాలుగు దశాబ్దాల (43 ఏళ్ల) కాలంలో చైనా జరిపిన మొదటి బహిరంగ 'జలాంతర్గామి ఆధారిత బాలిస్టిక్ క్షిపణి' (ఎస్ఎల్‌బీఎం) పరీక్షగా ఇది రికార్డుకెక్కింది. సోమవారం పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న అణుశక్తితో నడిచే ఒక జలాంతర్గామి నుండి చైనా ఈ క్షిపణిని ప్రయోగించింది. ఇది కేవలం ఒక సాధారణ ఆయుధ పరీక్ష మాత్రమే కాదని, శత్రుదేశాల మొదటి అణు దాడి నుండి తట్టుకుని నిలబడగల సముద్రగర్భ అణు నిరోధక శక్తి తమకు ఉందని చాటిచెప్పే బలమైన 'వ్యూహాత్మక సంకేతం' అని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ సీనియర్ ఫెలో జావో టోంగ్ తెలిపిన వివరాల ప్రకారం.. చైనాకు ఈ తరహా సామర్థ్యం ఎప్పటినుంచో ఉన్నప్పటికీ, ఇలా బహిరంగంగా ప్రపంచానికి ప్రదర్శించడం 1982 తర్వాత ఇదే మొదటిసారి. చైనా ఈ ప్రయోగానికి ముందు ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్ వంటి దేశాలకు ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ, ఏ రకమైన క్షిపణిని ప్రయోగించారనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచింది. అయితే, చైనా అధికారిక ఛానల్ 'సీసీటీవీ' సమాచారం ప్రకారం.. ప్రయోగించిన క్షిపణి 10,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధి గల అత్యాధునిక 'జీ-3' అయ్యే అవకాశం ఉందని చైనా మిలిటరీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీనిని టైప్ 094 క్లాస్ లేదా నిర్మాణంలో ఉన్న సరికొత్త టైప్ 096 క్లాస్ వ్యూహాత్మక జలాంతర్గామి నుండి ప్రయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు.

### ప్రాంతీయ దేశాల తీవ్ర ఆందోళన

చైనా అణ్వాయుధాల విస్తరణపై అమెరికా రక్షణ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి థామస్ పిగాట్ మాట్లాడుతూ.. చైనా వేగంగా పెంచుతున్న అణు సామర్థ్యాలు అంతర్జాతీయ భద్రతకు సవాల్‌గా మారాయన్నారు. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ ఈ చర్యను 'ప్రాంతీయ అస్థిరతకు కారణం' అని అభివర్ణించగా, న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి విన్స్టన్ పీటర్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జపాన్ రక్షణ శాఖ సైతం చైనా సైనిక చర్యలపై నిఘా పెంచింది. ఈ ప్రయోగం వెనుక చారిత్రాత్మక వ్యూహం కూడా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 1937 జులై 7న జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించిన 'మార్కో పోలో బ్రిడ్జ్' ఘటన వార్షికోత్సవానికి ఒకరోజు ముందే ఈ ప్రయోగం జరగడం గమనార్హం. కాగా, ఈ ఆరోపణలను చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ కొట్టిపారేశారు. ఈ ప్రయోగాన్ని ఇతర దేశాలు అతిగా ఊహించుకోవద్దని, చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ, శాంతియుత అణు విధానాలకే కట్టుబడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ తాజా పరీక్షతో చైనా భూమి, ఆకాశం, సముద్ర మార్గాల ద్వారా అణు దాడులు చేయగల 'న్యూక్లియర్ ట్రైయాడ్' సామర్థ్యాన్ని నిరూపించుకున్నట్లయింది.

శివసూర్య

గురువారం - 09 - జూలై - 2026

# అందుకే నా అండాలు దాచుకున్నా



## కొన్ని సంవత్సరాల క్రితమే తన అండాలను ఫ్రీజ్ చేయించుకున్నట్లు కృతి వెల్లడి

పెళ్లి, పిల్లల విషయంలో వయసు సంబంధిత ఒత్తిడిని అధిగమించేందుకే ఈ నిర్ణయమన్న నటి

'మిమి' సినిమా కోసం 15 కిలోల బరువు పెరిగే సమయంలో ఈ ప్రక్రియ పూర్తి చేశానన్న హీరోయిన్

ఈ ప్రక్రియ శారీరకంగా, మానసికంగా ఎంతో సవాలుతో కూడుకున్నదని వ్యాఖ్య

ఇది తనకు ఒక 'సేఫ్టీ నెట్' లాంటిదని, జీవితంలో ఒత్తిడిని తగ్గించిందని పేర్కొన్న కృతి సనన్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక కీలకమైన, స్ఫూర్తిదాయకమైన విషయాన్ని వెల్లడించారు. కెరీర్‌లో 'మిమి', 'క్రూ', 'బరేలీ కి బర్ఫీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దూసుకుపోతున్న ఆమె.. పెళ్లి, పిల్లల విషయంలో మహిళలు ఎదుర్కొనే సామాజిక, వయసు సంబంధిత ఒత్తిడిని అధిగమించేందుకు తాను కొన్ని సంవత్సరాల క్రితమే తన అండాలను ఫ్రీజ్ చేయించుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా, ఎలాంటి టైమ్‌లైన్ ఒత్తిడి లేకుండా జీవించే స్వేచ్ఛను పొందానని ఆమె పేర్కొన్నారు. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' వ్యవస్థాపకురాలు కరిష్మా మెహతాతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో కృతి ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మహిళలు ఎదుర్కొనే 'బయోలాజికల్ క్లాక్' సమస్య గురించి హోస్ట్ ప్రశ్నించగా, కృతి స్పందిస్తూ.. "నిజాయతీగా చెప్పాలంటే, నేను నా అండాలను ఫ్రీజ్ చేయించుకున్నాను. పెళ్లి ఇప్పుడే చేసుకోవాలి, పిల్లల్ని ఇప్పుడే కనాలి అనే ఒత్తిడికి నేను లోనవ్వాలని అనుకోలేదు. వివాహం అయినా, పిల్లలైనా సరే.. మనసులోంచి రావాలి కానీ, ఎవరో చెప్పారని, వయసు అయిపోతోందని కాదు" అని ఆమె స్పష్టం చేశారు. ఈ సదుపాయం అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చని, కానీ తాను ఆ ఖర్చు భరించగలిగినందుకు అదృష్టవంతురాలినని ఆమె అన్నారు. ఈ ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేశారనే విషయాన్ని కూడా కృతి వివరించారు. జాతీయ అవార్డు సాధించిపెట్టిన 'మిమి' సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరగాల్సి వచ్చింది. ఆ సమయంలోనే తాను ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "ఆ సినిమా కోసం బరువు పెరగడానికి నాకు రెండు నెలల సమయం దొరికింది. షూటింగ్ లేదు. అప్పుడే ఈ ప్రక్రియ గురించి ఒకరు నాకు సలహా ఇచ్చారు. ఇది మహిళలు తమకు తాము ఇచ్చుకునే ఉత్తమ బహుమతి అని చెప్పారు. పైగా 'మిమి' సినిమా సరోగసీ నేపథ్యంతో కూడుకున్నది కావడంతో, ఆ సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం సరైనదనిపించింది" అని కృతి గుర్తుచేసుకున్నారు. అయితే, ఎగ్ ఫ్రీజింగ్ ప్రక్రియ అంత సులభం కాదని, శారీరకంగా, మానసికంగా ఎంతో సవాలుతో కూడుకున్నదని ఆమె అంగీకరించారు. "ఆ సమయంలో హార్మోన్ల ప్రభావంతో ఎన్నో మూడ్ స్వింగ్స్ వస్తాయి. దాదాపు గర్భవతిగా ఉన్నట్లే అనిపిస్తుంది. కానీ ఆ ప్రక్రియ పూర్తి చేసినందుకు ఇప్పుడు సంతోషంగా ఉంది. నా తలపై ఒక గడియారం తిరుగుతోందన్న భావన ఇప్పుడు లేదు. ఇది నాకు ఒక 'సేఫ్టీ నెట్' లాంటిది. భవిష్యత్తులో నేను వాటిని ఉపయోగించకపోవచ్చు, కానీ నా చేతిలో ఒక అవకాశం ఉందనే ధైర్యం ఉంటుంది" అని కృతి వివరించారు. ఈ నిర్ణయం ద్వారా కెరీర్‌పైన, జీవితంపైన పూర్తి నియంత్రణ సాధించానని ఆమె అన్నారు.

# వేగం అందుకున్న వెంకీ-అనిల్ సినిమా.. సెట్స్‌లోకి వెంకటేశ్

షూటింగ్‌లో కల్యాణ్‌రామ్, కీర్తి, కృతి

సంక్రాంతి 2027కు సినిమా విడుదల

వెంకటేశ్-అనిల్‌కు ఇది ఐదో సినిమా








వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కలిసి నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ వేగం అందుకుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీలక షెడ్యూల్ ప్రారంభమైంది. దీంట్లో పాల్గొనేందుకు వెంకటేశ్ తాజాగా సెట్స్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్లలో వెంకటేశ్‌తో పాటు నందమూరి కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. ఇటీవల కల్యాణ్‌రామ్ పుట్టినరోజును చిత్రబృందం సెట్స్‌లోనే జరుపుకొంది. అదే సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, 2027 సంక్రాంతికి సినిమా విడుదల కానుందని ప్రకటించింది. ఇటీవల ఈ సినిమా పేరుతో నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో నిర్మాతలు హెచ్చరిక జారీ చేశారు. అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే ప్రకటనలను మాత్రమే నమ్మాలని, వ్యక్తిగత వివరాలు లేదా డబ్బు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితమే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. వెంకటేశ్‌తో అనిల్ రావిపూడికి ఇది ఐదో సినిమా. ఇప్పటికే 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి విజయాల తర్వాత మరోసారి ఇద్దరూ చేతులు కలిపారు. కల్యాణ్‌రామ్‌తో అనిల్‌కు ఇది రెండో చిత్రం. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'పటాస్' మంచి విజయం సాధించింది. ఈ చిత్రాన్ని అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే కుటుంబ వినోద కథగా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. హాస్యం, భావోద్వేగాలు, వినోదానికి సమాన ప్రాధాన్యం ఉండేలా అనిల్ రావిపూడి తన శైలిలో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

# కొడుకు కోసం సినిమాల ఎంపికను మార్చుకున్న కాజల్ అగర్వాల్!

పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న కాజల్

తన కొడుకు గర్వపడే సినిమాలనే చేస్తానని వెల్లడి

సందేశాత్మక చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నానన్న కాజల్





స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. అయితే తల్లి అయిన తర్వాత సినిమాల ఎంపికలో తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని ఆమె తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ'తో పాటు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'రామాయణ' షూటింగ్‌లతో బిజీగా ఉన్న కాజల్... తన కొడుకు నీల్ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వంగా చెప్పుకునేలా ఉండే స్క్రిప్ట్‌లను ఎంచుకుంటున్నట్లు తెలిపింది. కమర్షియల్ అంశాల కంటే బలమైన పాత్రలు, సందేశాత్మక చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పింది. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ఇండియా స్టోరీ'లో కాజల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపించనుది. శ్రేయస్ తల్పడే కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం జూలై 24న విడుదల కానుంది. కల్తీ ఆహారం, పురుగుమందుల ప్రభావం నేపథ్యంలో సాగే ఈ కథ విన్నాక... ఒక తల్లిగా తన ఇంట్లో వాడే ఆహార పదార్థాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని కాజల్ పేర్కొంది. మరోవైపు, నితేష్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'రామాయణ'లో కాజల్ మండోదరి పాత్ర పోషిస్తోంది. తన కుమారుడు నీల్‌కు చిన్నప్పటి నుంచే రామాయణ కథలంటే ఇష్టమని, అయితే అతనికి శ్రీరాముడి కంటే రావణుడి పాత్రే ఎక్కువ ఇష్టమని నవ్వుతూ చెప్పింది. 'రామాయణ' రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్‌కు ఐదేళ్లు వస్తాయని, థియేటర్‌లో వాడు చూసే మొదటి సినిమా ఇదే అవుతుందని కాజల్ ఆనందం వ్యక్తం చేసింది.

ధ్యాయాన్ని

# తల్లి కావడానికి ముందు సమంత మరో కీలక ప్రకటన!

తల్లి కాబోతున్న హీరోయిన్ సమంత

ఈ తరుణంలో స్టార్ హీరోయిన్ నుంచి మరో కీలక ప్రకటన

సోనీ లివ్ తమిళ్‌తో కొత్త ప్రాజెక్ట్

నిర్మాతగానా? నటిగానా? అనేది క్లారిటీ ఇవ్వని నటి

త్వరలో ప్రకటిస్తానని వెల్లడి





స్టార్ హీరోయిన్ సమంత వ్యక్తిగత జీవితంలో తల్లి కావడానికి సిద్ధమవుతూనే.. కెరీర్‌లో మరో కీలక అడుగు వేసింది. ఇటీవల తన ప్రెగ్నెన్సీని ప్రకటించిన ఆమె.. ప్రముఖ ఓటీటీ వేదిక సోనీ లివ్‌తో కొత్త భాగస్వామ్యాన్ని ప్రారంభించింది. సోనీ లివ్ తమిళ్‌తో కలిసి ఓ కొత్త ప్రాజెక్ట్‌ను సమంత ప్రకటించింది. అయితే ఇందులో ఆమె నటిస్తారా? నిర్మాతగా వ్యవహరిస్తారా? అనే విషయాలపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. సినీ వర్గాల సమాచారం ప్రకారం రెండు బాధ్యతలూ ఆమె చేపట్టే అవకాశం ఉంది. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. "ఈ ఏడాది మార్పులను స్వీకరించడం, కొత్త ఆరంభాలను ఆహ్వానించడం నేర్పింది. సోనీ లివ్ తమిళ్‌తో ఈ కొత్త ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఎంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాం. త్వరలోనే అందరితో పంచుకుంటాను" అని వెల్లడించింది. ఇక వ్యక్తిగత జీవితంలో సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'మా ఇంటి బంగారం' సినిమా థ్యాంక్స్ మీట్‌లో ఆమె తాను గర్భవతిని అని అధికారికంగా ప్రకటించింది. "కొంతకాలం విరామం తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మెటర్నిటీ లీవ్‌లోకి వెళ్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. చిన్న గ్యాప్ తర్వాత మళ్లీ వస్తాను" అని సమంత తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో బేబీ బంప్‌తో దిగిన ఫొటోను పంచుకున్న ఆమె.. "నా సిక్స్‌ప్యాక్... మళ్లీ కలుద్దాం" అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.